నేటి కందం-నేటికి అందం

సాకరు కప్పును బొంద న
నేకులు పోటీకి దిగగ నీదినమున మె
క్సీకో నందున ఫీఫా
ప్రాకటముగ ఖేలనమును ప్రారంభించెన్ !!

(నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరిగే సాకర్ ప్రపంచ కప్ పోటీలు ఈరోజు ఫీఫా ఆధ్వర్యంలో మెక్సీ కోలో ప్రారంభం అయ్యాయి.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

హైటెక్ సిటీలాగే
హైదరాబాద్ ఫ్యూచర్
సిటీ నిర్మాణమైతే
సింగపూరా నేచర్
ప్రారంభమే కదా పని
పూర్తయితేనే అర్థం
త్రిశంకు స్వర్గంలా
తలపించెనా వ్యర్థం

చురక

-వేల్పుల నారాయణ
9440433475



website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 13-6-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:238 పేజీలు:6 వెల: రూ.1/-


## 'ఉత్తమ వైద్యం అందిస్తాం'.. చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ



హైదరాబాద్, జూన్ 12: స్పైనల్ మస్కులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ) టైప్-2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు. తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా.. ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు.

చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే



స్పందించారు. 'చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎం ఆర్ఎఫ్ అధికారులు.. ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

## హైదరాబాద్‌లో రాజ్‌నాథ్ సింగ్ పర్యటన

### ఘన స్వాగతం పలికిన బీజేపీ నేతలు



హైదరాబాద్, జూన్ 12: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హైదరాబాద్ పర్యటనకు చేరుకున్నారు. రెండు రోజులు ఆయన నగరంలోనే ఉండనున్నారు. బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు బీజేపీ నాయకులు రాంచందర్‌రావు, జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తోపాటు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎన్డీయే ప్రభుత్వ పాలన పూర్తయిన సందర్భంగా సికింద్రాబాద్‌లో నిర్వహించిన 'ప్రబుద్ధ వర్గ సమ్మేళన్' (ఇంటలెక్చువల్ మీట్) కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. డీఆర్‌డీఎల్, డీఆర్‌డీఓ కాంప్లెక్స్‌ను సందర్శించి అక్కడ ఒక నూతన కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం సాయంత్రం ఎయిర్ ఫోర్స్ ఉన్నతాధికారులతో సమావేశమై పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు. రాత్రి ఆయన ఎయిర్ ఫోర్స్ అకాడమీలోనే బస చేయనున్నారు. పర్యటన రెండో రోజు కేంద్ర మంత్రి ఎయిర్ ఫోర్స్ అకాడమీలో జరిగే కంబైన్డ్ గ్రాడ్యుయేట్ పరేడ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న అధికార కేడెట్లకు అభినందనలు తెలియజేయనున్నారు. పరేడ్ కార్యక్రమం ముగిసిన అనంతరం రాజ్‌నాథ్ సింగ్ ఢిల్లీకి తిరుగు ప్రయాణం కానున్నారు. కేంద్ర రక్షణ మంత్రి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను అధికారులు మరింత కట్టుదిట్టం చేశారు.

# కార్మికులకు గుడ్‌న్యూస్..

**-త్వరలో మెడికల్ బోర్డు పునఃప్రారంభం!**
**-అర్హులకే ప్రయోజనం.. పారదర్శకంగా ప్రక్రియ నిర్వహణ**
**-కారుణ్య నియామకాలపై ప్రభుత్వ దృష్టి**
**-అక్రమాలకు తావులేకుండా కట్టుదిట్టమైన చర్యలు**
**-కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: భట్టి**

హైదరాబాద్, జూన్ 12: కార్మికులకు శుభవార్త. సింగరేణిలో వివిధ కారణాలతో కొద్ది కాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి, భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మెడికల్



బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు.

సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత శాసన సభ్యులు, మంత్రులతో నిర్వహించిన సమావేశం సందర్భంగా మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.

మెడికల్ బోర్డు ప్రక్రియ ద్వారా నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు.

కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందని, మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు.

ఇటీవల కాలం వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335 మంది వారసులకు మంచిర్యాలలో శనివారం (ఈ నెల 13వ తేదీ) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు తెలియజేశారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు.

సింగరేణిలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు.. ఇందులో భాగంగానే ఈ అంశంపై న్యాయ పరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిబంధనల మేరకు న్యాయ సలహా ప్రకారం సానుకూలంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి

అలాగే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్స్‌టర్నల్ పోస్టులు ఉండగా 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలను ఇవ్వడం జరిగిందన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్లైన్ పద్ధతిలో చేపట్టి వివాద రహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు.

కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ట వయోపరిమితిని 35 సంవత్సరాల నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింత మంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని వెల్లడించారు.

దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదే కాకుండా బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే సింగరేణి ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. అలాగే కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు.

ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత సింగరేణి చరిత్రలోనే అత్యధికంగా కార్మికులకు లాభాల వాటాను చెల్లించామని తెలియజేశారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేనా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్సు చెల్లిస్తున్నామని, 2023-24లో ఒక్కొక్కరికీ రూ.5,000 చొప్పున, 2024-25లో రూ.5,500 చొప్పున లాభాల బోనస్సు పంపిణీ చేసినట్లు తెలిపారు.


సింగరేణిలో ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ చేసేలా చర్యలు తీసుకోవడమే కాకుండా గోదావరిఖని లో క్యాథ్ ల్యాబ్ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు.

తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు పేర్కొన్నారు. అందువల్ల సింగరేణి కార్మికుల పట్ల తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత మరియు వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు.

రాబోయే రోజుల్లో కూడా సింగరేణిని బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాక్లు సాధించేందుకు తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి ప్రజా ప్రభుత్వంలో తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు.

రానున్న రోజుల్లో ఇతర రాష్ట్రాల్లోనూ సింగరేణిని విస్తరించే దిశగా తాము ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అయితే పోటీ మార్కెట్లో సింగరేణి నిల దొక్కుకోవాలంటే ఉత్పత్తి, ఉత్పాదకత పెరగాలని, ఇందుకోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

## ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డుల కోసం నిరంతర పోరాటం..



కామారెడ్డి, జూన్ 11: రాష్ట్రంలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు హెల్త్ కార్డుల కోసం నిరంతర పోరాటం చేయడం జరుగుతుందని రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు విరహత్ అలీ చెప్పారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా వర్కింగ్ మహాసభలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేయడం జరుగుతుందని తెలిపారు . జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ జిల్లా అధ్యక్షులు రజినీకాంత్ మున్సిపల్ చైర్మన్ ఉమారాణి శ్రీనివాస్ జర్నలిస్టులు ఉన్నారు.

## చట్టం అనే ముసుగులో కేంద్రం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్: మంత్రి పొంగులేటి

ఖమ్మం, జూన్12: ఎస్ఐఆర్ ఆనేది భయంకరమైన ఒక భూతమని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అభివర్ణించారు. చట్టం అనే ముసుగులో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దొంగ దారి ఎస్ఐఆర్ అని తెలిపారు. శుక్రవారం ఖమ్మం జిల్లా ఏదులాపురంలో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. అధికారులు ముందు ఓటు వ్యాపింగ్ చేస్తారని పేర్కొన్నారు. గ్రామంలో ఓట్లు తొలగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలంటూ బూత్ లెవల్ ఏజంట్లకు ఆయన స్పష్టం చేశారు. వివిధ కారణాలతో ఓట్లు తొలగిస్తారని బూత్ లెవల్ ఏజంట్లను అప్రమత్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రాంతాల్లో ఓటర్ లిస్టు పేరుతో ఓట్లు తొలగిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎస్ఐఆర్ ద్వారా రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలను కేంద్రం ఓడించిందని మంత్రి పొంగులేటి గుర్తుచేశారు. ఓట్ల తొలగింపును తిప్పికొట్టాల్సిన బాధ్యత బీఎల్ఏలదేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న అభిమానం కాపాడుకుంటే చాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ లబ్ధి పొందాలని చూస్తే.. దానిని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



తెలిపారు. రాజ్య సభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్‌కు టికెట్ ఇస్తే బీజేపీ గెలవదని తెలిసి కూడా ఆ పార్టీ అభ్యర్థిని పెట్టిందని చెప్పారు.తెలంగాణాలో ఎఫ్ఐఆర్ ఉందని అన్యాయంగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఇంతకు ముందు ఓట్లు దొంగిలించారని.. ఇప్పుడు సీట్లు దొంగిలించారని బీజేపీ తీరును ఈ సందర్భంగా ఆయన ఎండగట్టారు. సీబీఐ, ఈడీ పేరుతో గెలిచిన వారిని.. వారి వైపు తిప్పుకునేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చూస్తుందని మండిపడ్డారు.

ఇలాంటి సమయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి మనమందరం అండగా ఉండాలని పార్టీ శ్రేణులకు మంత్రి పొంగులేటి పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కుట్రలను తిప్పి కొట్టాల్సిన బాధ్యత కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుడిలా కష్టపడి ఓటు పోగొట్టకుండా జాగ్రత్త పడాలని బీఎల్ఏలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు.

## సీబీఎస్ఈ పోర్టల్ పునఃప్రారంభానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరణ

న్యూ ఢిల్లీ, జూన్ 12:సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ 12వ తరగతి విద్యార్థుల రీ-వెరిఫికేషన్, రీ-ఎవాల్యుయేషన్ కోసం ఉపయోగించే ఆన్‌లైన్ సర్వీస్ మెకానిజం పోర్టల్‌ను వెంటనే పునఃప్రారంభించాలన్న అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఈ దశలో పోర్టల్‌ను మరలా తెరిస్తే ఫలితాల తదుపరి ప్రక్రియ ఆలస్యం కావడంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయే ప్రమాదముందని స్పష్టం చేసింది.

ఈ మేరకు ఎన్ఎస్‌యూఐ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై శుక్రవారం విచారణ చేపట్టిన న్యాయస్థానం.. తక్షణ ఉపశమనం కల్పించేందుకు నిరాకరిస్తూ ఈ కేసును తదుపరి విచారణ కోసం రెగ్యులర్ బెంచ్‌కు బదిలీ చేసింది.

## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, జూన్ 12: తెలంగాణ రాష్ట్రాన్ని గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం నాడు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026' సదస్సుకు మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లాజిస్టిక్స్ రంగంలో భవిష్యత్ అవకాశాలపై సదస్సు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌లో కీలక రంగంగా లాజిస్టిక్స్‌ను ప్రభుత్వం గుర్తించిందన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.

తెలంగాణ వ్యాప్తంగా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టుల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. బాండెడ్ వేర్ హౌజింగ్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఏఐ సైబర్ సెక్యూరిటీ మెషీన్ లెర్నింగ్ వినియోగానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను తయారు చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని హామీ మంత్రి శ్రీధర్ బాబు హామీ ఇచ్చారు.

## రికార్డు స్థాయిలో మోదీ పాలన.. దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చడమే లక్ష్యం: ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్, జూన్ 12: 2047 నాటికి భారతదేశాన్ని 'వికసిత్ భారత్'గా నిలపాలనే సుదూర లక్ష్యంతో ప్రధాని మోదీ ముందుకు సాగుతున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం చారిత్రాత్మక మైలురాళ్లను అధిగమిస్తూ, రికార్డు స్థాయి పాలనతో ముందుకు సాగుతోందని డీకే అరుణ కొనియాడారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే రెండు కళ్లుగా భావించి ప్రధాని మోదీ నిరంతరం శ్రమిస్తున్నారని, ఆయన తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాల వల్లే నేడు భారతదేశం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని ఆమె స్పష్టం చేశారు. కేవలం ఆర్థిక రంగాన్నే కాకుండా, దేశ రక్షణకు పెద్దపీట వేస్తూ ఉగ్రవాదుల పట్ల కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని డీకే అరుణ పేర్కొన్నారు.

ప్రధాని మోదీ హయాంలో అమలువుతున్న విప్లవాత్మక సంక్షేమ పథకాలు, చారిత్రాత్మక నిర్ణయాలను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్వచ్ఛ భారత్, జన్ ధన్ యోజన, జీఎస్టీ అమలు, త్రిపుల్ తలాక్ రద్దు, ఆర్టికల్ 370 రద్దు వంటి సాహసోపేత నిర్ణయాలతో దేశ వ ం ం ఖ చి ( త ఎ ం మారిపోయిందన్నారు. మహిళా సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందన్న ఆమె.. 2030 నాటికి దేశంలో 3 కోట్ల మంది మహిళలను 'లఖ్‌పతి, కరోడ్‌పతి దీదీలు'గా మార్చడమే లక్ష్యంగా ప్రధాని విజన్‌తో పనిచేస్తున్నారని తెలిపారు. పీఎం కిసాన్, సుకన్య సమృద్ధి వంటి పథకాలు ప్రజల్లో ఎంతో భరోసానిచ్చాయని, ముఖ్యంగా రైతులకు ఎరువుల రూపంలో ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.24 వేల వరకు భారీ రాయితీ అందుతోందని ఆమె వివరించారు.



ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగాన సభ
సంయుక్త ఆధ్వర్యంలో
సాహిత్య సవ్యసాచి, విమర్శన కళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి గారి
79వ జయంతి సందర్భంగా



అధ్యక్షులు, తెలుగు రథం
శ్రీ కొంపెల్ల శర్మగారికి
కిన్నెర-ద్వానాశాస్త్రి స్మారక
పురస్కారం-బహూకరణ



డా॥ ద్వానా శాస్త్రి రచించిన
తెలుగు సాహిత్యంలో హాస్యామృతం
(ద్వితీయ ముద్రణ) ఆవిష్కరణ




సోమవారం 15-6-2026, సా॥ 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక,
శ్రీ త్యాగరాయగాన సభ, హైదరాబాదు

ముఖ్యఅతిథి : డా॥ కె.వి.రమణ, ఐఎఎస్ (రి) పూర్వ సలహాదారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
అధ్యక్షులు : శ్రీ జి. వల్లీశ్వర్, కార్యవర్గ, పాలకవర్గ సభ్యులు నేషనల్ బుక్ ట్రస్ట్ ఇండియా (GoI)
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్దనమూర్తి అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
గౌరవ అతిథులు : శ్రీ బైస దేవదాసు, 'నేటి నిజం' సంపాదకులు
శ్రీమతి శైలజామిత్ర, ప్రముఖ రచయిత్రి
ఆత్మీయ అతిథి : శ్రీ ద్వాదశి శశికాంత్, ద్వానా శాస్త్రి కుమారుడు

డా॥ ఆర్. ప్రభాకరరావు, ఐ.పి.ఎస్. (రి) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
శ్రీమతి కళా శారద కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

# టెయిలర్ కుటుంబానికి జీవనోపాధి కల్పించే కుట్టు మిషన్

## (13 జూన్ "జాతీయ కుట్టు మిషన్ దినోత్సవం" సందర్భంగా)

పూర్వకాలంలో నూలు వస్త్రాలను శ్రమించి చేతులతో కుట్టుకునే సంస్కృతి నుంచి నేడు కుట్టు యంత్రం లేదా సీవింగ్ మిషన్ ఆవిష్కరణ తర్వాత అతి తక్కువ సమయం, శ్రమ వెచ్చించకుండానే అత్యంత సులభంగా, అందమైన రీతుల్లో వస్త్రాలు కుట్టుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. నేడు ఇంటింటి మహిళల ఆత్మీయ నేస్తం అయ్యింది కుట్టు మిషన్. మహిళలకు ప్రతి మిత్రుడి వలె నిలుస్తూ, జీవనోపాధులను చూపుతోంది అద్భుత కుట్టు యంత్రం. నేడు వస్త్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కడానికి నేడు కుట్టు మిషన్లు మానవ ప్రమేయ యంత్రాలు, ఎలక్ట్రానిక్, కంప్యూటరైజ్డ్, ఎలక్ట్రిక్ రూపాల్లో పలు సైజులు, ఆకృతుల్లో కనిపిస్తున్నాయి. కుట్టు మిషన్ల రాకతో టైలరింగ్ వృత్తితో పాటు అసంఖ్యాక మహిళలు ఆర్డర్లు తీసుకొని ఇంటి నుంచే బట్టలు కుడుతూ తమ తమ జీవనోపాధులను పొందడం జరుగుతున్నది.

### జాతీయ కుట్టు మిషన్ దినం:

కుట్టు మిషన్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 13 జూన్న "జాతీయ కుట్టు మిషన్ దినం" లేదా "నేషనల్ సీవింగ్ మిషన్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. కుట్టు మిషన్ ఆవిష్కరణ మానవాళి నిత్య జీవితంలో, జీవనశైలిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ఫ్యాషన్ ప్రపంచానికి ఇది ఓ అద్భుత వరంగా మారింది. పెద్ద ఎత్తున వస్త్రాలను తయారు చేయడం, ఫ్యాషన్ లోకంలో అసంఖ్యాక డిజైన్లను పరిచయం చేయడం, వస్త్ర పరిశ్రమ రూపురేఖల్ని మార్చి వేయడం కొనసాగుతోంది. నేడు టైలరింగ్ వృత్తులు, ఫ్యాషన్ డిజైనర్లు, సాధారణ మహిళలు, అభిరుచి కలిగిన వ్యక్తులు కుట్టు మిషన్ ప్రాధాన్యాలను గుర్తించి దాని ప్రచారానికి ఎనలేని కృషి చేస్తున్నారు. జాతీయ కుట్టు మిషన్ దినం వేదికగా కుట్టు మిషన్ ప్రదర్శనలు, కుట్టు మిషన్ పని తీరు పట్ల అవగాహన, కుట్టు మిషన్ సహాయంతో తయారు చేసిన పలు రకాల వస్త్ర డిజైన్ల ప్రదర్శనలు, ప్రఖ్యాత టైలర్లను సన్మానించడం, కుట్టు మిషన్లలో వచ్చిన ఆధునిక సాంకేతిక మార్పులు లాంటివి అవగాహన చేసుకోవచ్చు.

### కుట్టు మిషన్ పుట్టుక :

కుట్టు మిషన్ చరిత్ర 150 ఏండ్ల క్రితమే ప్రారంభమైంది. 13 జూన్ 1829 రోజున ఫ్రెంచ్ టేలర్ "బార్థలెమి టిమ్మోనియర్" కృషితో కుట్టు యంత్రం కనుగొనబడింది. అంతకు పూర్వం పలు ప్రయత్నాలు జరిగిన విషయం కూడా జరగడం జరిగింది.

10 సెప్టెంబర్ 1847న అమెరికన్ "ఇలియాస్ హోవె" తొలిసారి కుట్టు మిషన్ను పేటెంట్ చేసారు.

1851లో "ఐజాక్ సింగర్" అను శాస్త్రవేత్త అత్యాధునిక కుట్టు యంత్రం రూపొందించి వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం జరిగింది. కుట్టు మిషన్ తయారీలో తమ మేధస్సును వెచ్చించిన పలువురు ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం మన కనీస బాధ్యత అవుతుంది. నేడు వస్త్ర పరిశ్రమ పెద్ద ఎత్తున పెరగడానికి పునాదిగా నాటి, నేటి కుట్టు మిషన్ నిలుస్తున్నది. నేడు కుట్టు మిషన్ సామాన్యుల ఇంటిలో ఒక అవిభాజ్య భాగం అయ్యింది. మహిళలు తమ ఇంటి వస్త్రాలను, జీవనోపాధిగా ఇతరుల వస్త్రాలను కుట్టడానికి మన కుట్టు మిషన్ దోహదపడుతున్నది. మనకు వస్త్రాలను కుట్టి, మన అందాన్ని ఇనుమడింపజేస్తున్న టైలర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుదాం. కుట్టు మిషన్ల ప్రదర్శనలకు వెళ్లి పలు రకాల కుట్టు యంత్రాలను చూసి వద్దాం.



-మధుపాళీ
9949700037

# దేశానికి మేధోపరమైన నిజాయితీ, సామాజిక స్పృహ, సాంకేతిక నైపుణ్యం, ప్రజాస్వామ్య విలువలపై నిబద్ధత కలిగిన జర్నలిస్టులు అవసరం: ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జూన్ 12:ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ (ఐఐఎంసీ)కు చెందిన చివరి సంవత్సరం పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం ఉపరాష్ట్రపతి భవన్‌లో సంసద్ టీవీ నిర్వహించిన నెల రోజుల ఇంటర్న్‌షిప్ కార్యక్రమ ముగింపు వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ప్రసంగించారు.

ఈ కార్యక్రమ నిర్వహణపై శ్రీ సీపీ రాధాకృష్ణన్ హర్షం వ్యక్తం చేస్తూ.. ఈ ఏడాది ప్రారంభంలో తాను ఐఐఎంసీ స్నాతకోత్సవానికి వెళ్లినప్పుడు సంసద్ టీవీ ద్వారా విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ అవకాశాలు కల్పించాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ ప్రతిపాదనను వెంటనే అమలు చేసినందుకు అభినందనలు తెలియజేశారు. ఇంటర్న్‌లకు మార్గదర్శకత్వం వహించిన సంసద్ టీవీ నిపుణులను ప్రశంసించారు.

ప్రజాస్వామ్యంలో మీడియా పాత్రను ప్రస్తావిస్తూ... దేశానికి మేధోపరమైన నిజాయితీ, సామాజిక స్పృహ, సాంకేతిక నైపుణ్యం, ప్రజాస్వామ్య విలువలపై నిబద్ధత కలిగిన పాత్రికేయులు, కమ్యూనికేటర్లు అవసరమని శ్రీ సీపీ రాధాకృష్ణన్ పేర్కొన్నారు. మీడియాకు కేవలం కథనాలను రూపొందించడమే కాకుండా.. దేశాల భవిష్యత్తును కూడా తీర్చిదిద్దే శక్తి ఉందని తెలిపారు.

2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికతను సాకారం చేయడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి ప్రయాణాన్ని నిజాయితీతో, నిష్పాక్షికంగా ప్రపంచానికి చాటాలని కోరారు. నేడు భారత్‌లోని యువశక్తి, సాంకేతిక ఆవిష్కరణలు, ప్రజాస్వామ్య పటిష్టతను చూసి ప్రపంచమంతా మన వైపు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తోందని తెలిపారు.

నేటి కాలంలో కేవలం ప్రజల దృష్టిని ఆకర్షించడం కోసమే వార్తలను సంచలనం చేయడంపై శ్రీ సీపీ రాధాకృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా విశ్వసనీయత కేవలం ప్రజాదరణపై కాకుండా వాస్తవాల ఖచ్చితత్వం, ప్రజా ప్రయోజనాలపైనే ఆధారపడి ఉండాలని తెలిపారు. కాబోయే పాత్రికేయులు ఎల్లప్పుడూ, నిజాయితీని, నిష్పాక్షికతను, బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రోజురోజుకీ పెరుగుతున్న కృత్రిమ మేధ ప్రభావాన్ని ప్రస్తావిస్తూ.. పరిశోధనలకు, సమాచార ధ్రువీకరణకు సాంకేతికత శక్తిమంతమైన సాధనంగా ఉపయోగపడుతున్నప్పటికీ, సంపాదకీయ నిర్ణయాలు మాత్రం మానవ ఆలోచనా శక్తి ఆధారంగానే సాగాలని ఉపరాష్ట్రపతి అన్నారు. తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌ల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలిపారు.

అన్ని వర్గాలకూ సమాన ప్రాధాన్యతనిచ్చే జర్నలిజం గురించి ఉపరాష్ట్రపతి వివరించారు. దేశాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే కేవలం మహా నగరాలకే పాత్రికేయాన్ని పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా ఉన్న ప్రజల ఆకాంక్షలు, సవాళ్లు, వారి విజయాలపై మరింత దృష్టి పెట్టాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ శ్రీ హరివంశ్, రాజ్యసభ సెక్రటరీ జనరల్ శ్రీ పీపీ మోదీ, ఉపరాష్ట్రపతి కార్యదర్శి, సంసద్ టీవీ ముఖ్య కార్యనిర్వహణాధికారి శ్రీ అమిత్ ఖరే, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ చంచల్ కుమార్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ప్రజ్ఞా పాలివాల్ గౌర్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రారంభ మూలధన (వెంచర్ క్యాపిటల్), సాంకేతిక స్వావలంబన నిధులతో భారత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు ఉత్తేజం: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, జూన్ 12:ప్రపంచస్థాయిలో పోటీపడేలా దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వేగంగా అభివృద్ధి చేయడం, విదేశీ దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం లక్ష్యంగా.. అంతరిక్ష రంగంలో పెట్టుబడులనూ, భాగస్వామ్యాన్నీ భారీగా విస్తరించాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ, భౌగోళిక విజ్ఞాన శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర హోదా), పీఎంవో-అణు ఇంధన - అంతరిక్ష విభాగం - సిబ్బంది, ప్రజా వ్యవహారాలు, పింఛన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ పారిశ్రామిక ప్రముఖులకు పిలుపునిచ్చారు.

పదో ఇన్‌స్పేస్ పారిశ్రామిక సదస్సులో డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రసంగించారు. దేశ అంకుర సంస్థలు అద్భుతమైన ఆవిష్కరణలనూ, సాంకేతిక సామర్థ్యాన్నీ ప్రదర్శిస్తున్నాయన్నారు. అయితే ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో అగ్రగామిగా ఎదగాలంటే నిధుల లభ్యత, ఉత్పాదక సామర్థ్యం, మార్కెట్ లభ్యతను పెంచుకుంటూ.. ప్రముఖ పరిశ్రమల నుంచి మరింత పటిష్టమైన భాగస్వామ్యం ఆవశ్యకమని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అందుబాటులోకి తేవడాన్ని.. వ్యూహాత్మక రంగాల పట్ల భారత్ విధానంలో చరిత్రాత్మక మార్పుగా డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. సాహసోపేత నిర్ణయంగా ఈ సంస్కరణలను అభివర్ణించారు. ఇది దేశంలోని అంతర్గత పారిశ్రామిక నైపుణ్యాన్ని వెలికితీయడమే కాకుండా.. అనతికాలంలోనే భారత అంతరిక్ష వ్యవస్థ రూపురేఖలను మార్చేసిందని వ్యాఖ్యానించారు.

అంతరిక్ష రంగానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం చేపట్టిన విధానపరమైన కార్యక్రమాలను డాక్టర్ జితేంద్ర సింగ్ వివరించారు. అంతరిక్ష రంగ సంస్కరణల అనంతరం రూపొందించిన భారత అంతరిక్ష విధానం - 2023 ఈ రంగంలోని భాగస్వాములకు వ్యూహాత్మక దిశానిర్దేశాన్నీ, నియంత్రణపరమైన స్పష్టతనూ అందించిందన్నారు. దీనితోపాటు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానాన్ని సరళీకరణ పెట్టుబడులను ఆకర్షించిందనీ, అన్ని దశల్లోనూ అంతర్జాతీయంగా భారత్ మరింతగా అనుసంధానమయ్యేందుకు దోహదపడిందని వివరించారు.

భారత జాతీయ అంతరిక్ష ప్రోత్సాహక, ఆధీకృత కేంద్రం (ఇన్-స్పేస్) ఏర్పాటును ఒక విశిష్టమైన సంస్థాగత సంస్కరణగా అభివర్ణించారు. ఇది అంతరిక్ష రంగంలోని అన్ని దశల్లోనూ ప్రభుత్వేతర సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంలో, అనుమతించడంలో, పర్యవేక్షించడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

ఆర్థిక, సంస్థాగత సహాయక వ్యవస్థల ద్వారా దేశంలో ఆవిష్కరణలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వ కృషిని డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ సందర్భంగా వివరించారు. అంతరిక్ష రంగంలో ఆవిష్కరణలనూ, వాటి వాణిజ్యీకరణనూ సులభతరం చేయడం కోసం రూ. 1,000 కోట్ల ప్రారంభ మూలధన నిధినీ, రూ. 500 కోట్ల సాంకేతిక స్వావలంబన నిధినీ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. వీటితోపాటు ప్రాథమిక మూలధనం, ప్రారంభస్థాయి సహకారం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఏఐసీటీఈ ఆమోదించిన అంతరిక్ష సాంకేతికతా పాఠ్యప్రణాళిక వంటి కార్యక్రమాలు.. దేశంలో వేగంగా విస్తరిస్తున్న అంతరిక్ష ఆర్థిక వ్యవస్థకు అవసరమైన భవిష్యత్ అవసరాలకు తగిన ప్రతిభావంతులైన మానవ వనరులను సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.

దేశంలో ప్రైవేటు అంతరిక్ష వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతోందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. కేవలం కొద్దిపాటి అగ్రగామి సంస్థలతో మొదలైన ఈ ప్రయాణం.. నేడు 400కు పైగా అంకుర సంస్థలు, వందలాదిగా చిన్నా పెద్దా కంపెనీలతో భారీ వ్యవస్థగా అవతరించిందని గుర్తుచేశారు. భారతీయ సంస్థలు నేడు ప్రయోగ వాహనాలు, చోదక వ్యవస్థలు, భూ పరిశీలన అప్లికేషన్లు, అంతరిక్ష పరిస్థితుల అవగాహన సామర్థ్యాలతోపాటు అనేక రకాల అనుబంధ సేవలనూ అభివృద్ధి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, గెలాక్సీ, దిగంతర, ధ్రువ స్పేస్ వంటి కంపెనీలు దేశ పారిశ్రామిక సామర్థ్యానికీ, సాంకేతిక ఆవిష్కరణలకూ నిదర్శనమని మంత్రి అభినందించారు.

వైజ్ఞానిక పరిశోధనల రంగంలో ఉదారంగా వ్యవహరించే ధోరణిని పెంపొందించుకోవాలని డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. మన సంప్రదాయంలో దాతృత్వ విరాళాలు సేవా కార్యక్రమాలకే పరిమితమవుతున్నాయన్నారు. పరిశోధనలు, ఆవిష్కరణల్లో పెట్టుబడులను కూడా ముఖ్యమైన సామాజిక సేవగా గుర్తించాలన్నారు.

క్రమంగా విస్తరిస్తున్న అంతరిక్ష వ్యవస్థలో పనిచేసేటప్పుడు తాము ఎదుర్కొంటున్న సవాళ్లను, ఇబ్బందులను ఉన్నదున్నట్టుగా తెలియజేయాలని పరిశ్రమ వర్గాలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. వారికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. విధానరూపకర్తలకూ, పరిశ్రమ వర్గాలకూ మధ్య ఎప్పటికప్పుడు బహిరంగ, నిర్మాణాత్మక చర్చలు జరగడం అత్యంత కీలకమన్నారు.

వేగవంతమైన అనుమతులు, సరళీకృత ప్రక్రియలు, సమర్థమైన ఏకగవాక్ష విధానం అవసరమంటూ.. పరిశ్రమ వర్గాలు వ్యక్తం చేసిన ఆందోళనలను డాక్టర్ జితేంద్ర సింగ్ అంగీకరించారు. కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే పరిపాలనలో ముఖ్య లక్ష్యంగా ఉండాలనీ, అంతే తప్ప అనవసర అడ్డంకులను సృష్టించేలా ఉండకూడదనీ అన్నారు.

ఆత్మనిర్భర అంతరిక్ష రంగాన్ని సాకారం చేసుకునే దిశగా.. ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులు, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య మరింత బలమైన సమన్వయం ఆవశ్యకమని డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. అంకుర సంస్థల వేగానికి ? ప్రముఖ పరిశ్రమల భారీ వనరులు, ఆర్థిక బలం, కార్యాచరణ సామర్థ్యాలు తోడు కావాలని అభిప్రాయపడ్డారు.

# రైతుల సంక్షేమం, వ్యవసాయంలో ఆధునిక సదుపాయాలు, వ్యవసాయ రంగానికి సాధికారత కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జూన్ 12:దేశ ఆహార భద్రత, పోషణ, సమృద్ధికి మన రైతు సోదరీ, సోదరులు మూల స్తంభాలని, వారి జీవి తాల్ని సులభతరంగా మార్చడానికి ప్రభుత్వం సర్వశక్తులతో ప్రయత్నిస్తోందని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు స్పష్టంచేశారు. 'పీఎమ్-కిసాన్ సమ్మాన్ నిధి', 'ఫసల్ బీమా యోజన' వంటి కార్యక్రమాలు రైతులకు ఆదాయ భద్రతను సమకూర్చడంతో పాటు, వ్యవసాయానికి సాధికారతను కూడా కల్పిస్తున్నాయని, 'పీఎమ్-కుసుమ్ పథకం' సౌర ఇంధనాన్ని సులభతరం చేస్తోందని, దీంతో వ్యవసాయానికి అయ్యే ఖర్చులు తగ్గుతున్నాయని ఆయన వివరించారు.

రైతులకు, పశువుల పెంపకందారులకు, మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డు సులభంగా, తక్కువ వడ్డీకి రుణాలను అందిస్తూ చాలా ప్రయోజనకారిగా ఉంటోందని శ్రీ మోదీ తెలిపారు. 'విత్తనం నుంచి మార్కెట్టు వరకు' కార్యక్రమం రైతులు పండించే పంటలకు న్యాయమైన ధరలు లభించేటట్లు చూస్తోందని ఆయన అన్నారు.

రైతుల సంక్షేమం అగ్ర ప్రాధాన్యాల్లో ఒకటిగా ఉందని ప్రధానమంత్రి అన్నారు. ఈ కారణంగానే వారికి ఆధునిక వ్యావసాయిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడంపై నిరంతర శ్రద్ధ తీసుకొంటున్నారని ప్రధాని వివరించారు. డ్రోన్లు, భూసార కార్డులు, ప్రాకృతిక ఎరువులకు సంబంధించిన ప్రచార ఉద్యమాలు పంట ఉత్పాదకతను పెంచడంలో రైతులకు ఎంతగానో తోడ్పడుతున్నాయని ఆయన ప్రస్తావించారు.

"మన రైతు సోదరీ, సోదరులు దేశానికి ఆహార భద్రత, పోషణతో పాటు సమృద్ధికి కూడా మూల స్తంభాలుగా నిలుస్తున్నారు. వారి జీవితాల్ని సాధ్యమైనంత ఎక్కువ సులభతరంగా మార్చడానికి మా ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. పీఎమ్-కిసాన్ సమ్మాన్ నిధి, పంట బీమా పథకం వంటి అనేక కార్యక్రమాలు వారి ఆదాయానికి భద్రతను కల్పించడంతో పాటు, వ్యవసాయాన్ని ఇదివరకటి కన్న శక్తిమంతంగా మారుస్తున్నాయి. పీఎమ్-కుసుమ్ పథకం వ్యవసాయానికి గాను సౌర ఇంధనాన్ని సులభమైన పద్ధతిలో రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ పథకంతో సాగుకు అయ్యే ఖర్చు కూడా తగ్గింది.

# సహజ వనరుల సంరక్షణకు సమిష్టి కృషి అవసరం

## -పర్యావరణ పరిరక్షణలో ఐటీసీ, భాగస్వామ్య సంస్థల కృషి అభినందనీయం

## -భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్

ఖమ్మం, జూన్ 12: భవిష్యత్ తరాల కోసం సహజ వనరులను కాపాడుకోవడంతో పాటు వచ్చదనాన్ని పెంపొందించుకోవడం, వన్యప్రాణుల ఆవాసాలను రక్షించడం కోసం సమిష్టి కృషి అవసరమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖాధికారి కృష్ణగౌడ్ అన్నారు. గురువారం బూర్గంపహాడ్ మండల పరిధిలోని ఐటీసీ కర్మాగారంలో ఐటీసీ మిషన్ సునెరెకల్ ఆధ్వర్యంలో అటవీశాఖ [illegible] ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్‌తో పాటు అటవీ విభాగ అధికారి ఆర్.బాబు, ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, ఐటీసీ హెచ్ఆర్ జీఎం శ్యామి కిరణ్, డీజీఎం చెంగల్‌రావు, మిషన్ సునిరేకల్ ప్రతినిధులు గీత ప్రవల్లిక, కుంటల్ సర్కార్లు పాల్గొని మాట్లాడారు. అటవీ వైవిధ్యీకరణ, పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ ప్రాముఖ్యతను వివరించారు.

ఐటీసీ సునిరేకల్ ప్రతినిధులు అమలుచేసిన, చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రదర్శించగా వాటిని అటవీశాఖ జిల్లా అధికారి తిలకించి అభినందించారు. సామాజిక అటవీకరణ, సుస్థిర వ్యవసాయపద్ధతులు, అటవీ, సామూహిక భూముల జీవ వైవిధ్య పరిరక్షణ, రైతుల జీవనోపాధి అభివృద్ధి, ప్రాథమిక విద్య, మహిళా సాధికారిత, ఆరోగ్యం, పారిశుధ్యం, ఘనవ్యర్థాల నిర్వహణ, గ్రామీణ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ అంశాలను క్లుప్తంగా ప్రదర్శన రూపంలో వివరించారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం మరింత పెంచాలని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన కల్పించి అవలంబించడం అభినందనీయమని ఐటీసీని అభినందించారు. అనంతరం జిల్లా అటవీశాఖ అధికారి ఐటీసీ ఉన్నతాధికారులతో కలిసి ఐటీసీ ఆవరణలో మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్లు, సునిరేకల్ ప్రతినిధులు, అటవీశాఖ రేంజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 19వ వార్డులో క్షుద్రపూజల కలకలం..

## -భయాందోళనలో బస్తీ ప్రజలు

నల్గొండ, జూన్ 12:బెల్లంపల్లి పట్టణంలోని 19వ వార్డులోని బెల్లంపల్లి బస్తీలో క్షుద్ర పూజలు చేసిన గుర్తులు కనిపించడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బస్తీలోని ఒక ప్రాంతంలో ఎర్రటి కుంకుమతో పెద్ద పెద్ద ముగ్గులు వేసి, వాటి మధ్యలో నిమ్మకాయలు, పసుపు, కుంకుమలు చల్లి, దీపాలు వెలిగించి ఉండటాన్ని స్థానికులు గమనించారు. ఈ వింత ఆకృతులను చూసిన వార్డు ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గత కొంతకాలంగా బస్తీ పరిసరాల్లో ఇలాంటి వింత పూజల ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. అర్ధరాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఇటువంటి క్షుద్ర పూజలకు పాల్పడుతున్న వ్యూహకర్తలను పోలీస్ అధికారులు వెంటనే గుర్తించాలని, వారిపై తగు చర్యలు తీసుకుని బస్తీ ప్రజల భయాలను పోగొట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

# తిరు భారతిరాజా జీ కన్నుమూత పట్ల విచారాన్ని వ్యక్తం చేసిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, జూన్ 12:తిరు భారతిరాజా జీ కన్నుమూత పట్ల ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. చలనచిత్ర రంగంలో శిఖరాయమాన వ్యక్తులలో ఒకరుగా ఆయన పేరు తెచ్చుకున్నారని, ఆయన సినిమాలు తమిళ చలనచిత్ర రంగంలో పెనుమార్పును తీసుకు వచ్చాయని ప్రధానమంత్రి అన్నారు.

మరీ ముఖ్యంగా పల్లె వాసుల జీవితాన్ని భారతిరాజా చిత్రించిన తీరు ప్రశంసనీయమైందని శ్రీ మోదీ తెలిపారు. "ఈ దుఃఖ ఘడియలో భారతిరాజా కుటుంబానికి, అభిమానులకు కలిగిన శోకంలో నేను కూడా పాలుపంచుకుంటున్నాను. ఓమ్ శాంతి" అని ప్రధాని అన్నారు.

"తిరు భారతిరాజా జీ కన్నుమూత అత్యంత దుఃఖాన్ని కలిగించింది. చలనచిత్ర రంగంలో శిఖరాయమాన వ్యక్తులలో ఒకరుగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ఆయన సినిమాలు తమిళ చలనచిత్ర రంగంలో పెనుమార్పును తీసుకు వచ్చాయి. పల్లె వాసుల జీవితాన్ని ఆయన చిత్రించిన తీరు ప్రశంసనీయం.


**ఆహ్వానం**

కవిసంధ్య

తెలుగు శాఖ, డా. ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, యానాం
కవిసంధ్య - సాహిత్య సాంస్కృతిక సంస్థ, యానాం
సంయుక్త నిర్వహణ లో

**కవిత్వ శిక్షణా శిబిరం**
**National Poetry Workshop**

కవి సంధ్య
60వ ప్రత్యేక సంచిక
ఆవిష్కరణ



13-14 జూన్ 2026, శనివారం, ఆదివారం
ఉదయం 9.30 గం॥లకు

డా.ఎల్.ఆర్.స్వామి ప్రాంగణం
డా.ఏటుకూరి ప్రసాద్ వేదిక
సెమినార్ హాలు, డా.ఎస్.ఆర్.కె. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, యానాం

డా.వరుగు భాస్కర్ రెడ్డి
సదస్సు సంచాలకులు,
ప్రిన్సిపాల్, డా.ఎస్.ఆర్.కె.ఆర్ట్స్ కళాశాల, యానాం.
9440127967

డా.శిఖామణి
అధ్యక్షులు, కవి సంధ్య
9848202526

**నాల్గవ సదస్సు**
14.6.2026, ఆదివారం ఉదయం 10.00 నుండి 1.00 వరకు
డా.ఆర్.సీతారాం
అంశం : కవిత్వం - రచనా వ్యూహాలు
శ్రీ నామాడి శ్రీధర్
అంశం : కవిత్వం - అపురూపత
డా.సుంకర గోపాల్
అంశం : కవిత్వం - వస్తువు
సమన్వయ కర్త : డా.శిఖామణి
భోజనవిరామం : 1.30 నుండి 2.00 వరకు

**అయిదవ సదస్సు**
2.00 నుండి 4.00 వరకు
డా.ఎల్.కె. సుధాకర్
అంశం : కవిత్వం - అనువాదం
శ్రీ దాట్ల దేవదానం రాజు
అంశం : కవిత్వం - అనుభవం
డా.శిఖామణి
అంశం : కవిత్వం : రచనా పద్ధతులు
సమన్వయ కర్త : శ్రీ అవధానుల మణిబాబు

4.00. గం.లకు
**సమాపన సదస్సు**
ముఖ్య అతిథి : శ్రీ దాట్ల దేవదానం రాజు
అధ్యక్షులు : డా.వరుగు భాస్కర్ రెడ్డి, ప్రిన్సిపాల్
సమాపన ప్రసంగం : డా.శిఖామణి

**కవుల స్పందన - సర్టిఫికెట్స్ బహూకరణ**

వందన సమర్పణ : డా. జె.చంద్రశేఖరరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, జువాలజీ

# 'ఆయిల్ సీడ్స్ కిసాన్ మిత్ర' - నూనె గింజల రైతుల కోసం
# భారత తొలి దేశవ్యాప్త వాట్సాప్ ఏఐ సూచనల కార్యక్రమం

న్యూఢిల్లీ, జూన్ 12:దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని పెంచడం, వంట నూనె దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడంపై దృష్టి సారిస్తూ దేశం ఖరీఫ్ సాగు కాలంలోకి ప్రవేశిస్తున్న తరుణంలో... హైదరాబాద్‌కు చెందిన ఐసీఏఆర్-ఇండియన్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఐసీఏఆర్-ఐఐవోఆర్) వాట్సాప్ ఆధారిత ఏఐ సూచనల కోసం 'ఆయిల్ సీడ్స్ కిసాన్ మిత్ర'ను అభివృద్ధి చేసింది. నూనెగింజల సాగుకు సంబంధించిన విశ్వసనీయమైన, పరిశోధన ఆధారిత జ్ఞానాన్ని రైతుల మొబైల్ ఫోన్లకు ఎప్పుడైనా, వారి సొంత భాషలో నేరుగా అందించే ఒక శక్తిమంతమైన సాధనంగా ఇది ఆవిర్భవిస్తోంది.

వ్యవసాయ రంగానికి ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేందుకు డిజిటల్ టెక్నాలజీని వినియోగించడం పట్ల ఐసీఏఆర్ నిబద్ధతను స్పష్టం చేస్తూ... 2026 ఫిబ్రవరి 6న న్యూఢిల్లీలో జరిగిన జాతీయ నూనెగింజల సదస్సులో డీఏఆర్ఈ కార్యదర్శి, ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ సంయుక్తంగా ఈ సేవను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా, దేశంలో ఏ రకమైన నూనెగింజలు సాగు చేసే రైతులైనా... అదనపు అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండానే... ఇప్పటికే లక్షలాది మంది రైతులకు సుపరిచితమైన వాట్సాప్ వేదిక ద్వారానే విశ్వసనీయమైన, తక్షణ పంట సలహాలను ఉచితంగా పొందవచ్చు.

రైతులు +91 402 4598 180 నంబరును వాట్సాప్‌లో 'ఆయిల్ సీడ్స్ కిసాన్ మిత్ర'గా సేవ్ చేసుకొని... వేరుశనగ, ఆవాలు, నువ్వులు, పొద్దుతిరుగుడు, సోయాబీన్, నైజర్, ఇతర నూనెగింజల పంటల గురించి ఏ భారతీయ భాషలోనైనా ప్రశ్నలు అడగవచ్చు. ఏఐ-ఆధారిత చాట్‌బాట్... వంగడాల ఎంపిక, పంట నిర్వహణ, తెగుళు-వ్యాధుల నియంత్రణ, నీటిపారుదల, పంట కోతానంతర పద్ధతులపై పరిశోధన ఆధారిత మార్గదర్శనంతో అన్ని వేళలా తక్షణం స్పందిస్తుంది. ఇది పూర్తిగా ఉచిత సేవ. హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ -ఇండియన్ ఆయిల్ సీడ్స్ పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కె. మాథుర్ మాట్లాడుతూ... ఐసీఏఆర్ సంస్థలు నూనెగింజలపై చేసిన సమష్టి పరిశోధన ద్వారా, దేశంలో నూనెగింజలు సాగు చేసే ప్రతి రైతుకు వారు ఇప్పటికే ఉపయోగిస్తున్న వేదికపై, వారి సొంత భాషలో పంట సంబంధిత సూచనలను అందించే తొలి వ్యవస్థ 'ఆయిల్ సీడ్స్ కిసాన్ మిత్ర' అన్నారు. ఐసీఏఆర్-ఐఐఓఆర్... ఎన్ఎస్ఆర్ఐ... ఐఐజీఆర్... ఐఐఆర్ఎంఆర్... పీసీ-యూనిట్ (నువ్వులు, నైజర్) సంస్థల శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వాట్సాప్‌లోని బహుభాషా ఏఐ ఏజెంట్‌తో అనుసంధానించడం ద్వారా ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ప్రయోగశాలకు, రైతు పొలానికి మధ్య ఉన్న దూరం, భాష, ఖర్చు వంటి దీర్ఘకాలిక అవరోధాలను తాము తొలగించామని ఆయన తెలిపారు. ఖరీఫ్ సాగు ప్రారంభమవుతున్న సమయంలో నూనెగింజల రైతులు, ఇతర భాగస్వాములంతా 'కిసాన్ మిత్ర'ను సేవ్ చేసుకోవడం ద్వారా, ఏ సమయంలోనైనా తమకు గల సందేహాలను అడిగి, నివృత్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనేక ఐసీఏఆర్ సంస్థల సమష్టి శాస్త్రీయ నైపుణ్యంతో అభివృద్ధి చేసిన అధునాతన ఏఐ ఆధారిత, సమగ్ర విజ్ఞాన వ్యవస్థను ఉపయోగించి... 'ఆయిల్ సీడ్స్ కిసాన్ మిత్ర' ప్రాంతీయ భాషల్లో టైప్ చేసిన, పంపిన ప్రశ్నలను అర్థం చేసుకుని, పంటకు అనుగుణంగా కచ్చితమైన సమాధానాలను అందిస్తుంది. రైతులకు ప్రత్యేక యాప్ లేదా ఇంటర్నెట్ బ్రౌజర్ అవసరం లేదు. సుపరిచితమైన వాట్సాప్ ఇంటర్‌ఫేస్ ఉంటే సరిపోతుంది. ఈ చాట్‌బాట్... వంగడాల ఎంపిక, వ్యవసాయ పద్ధతులు, తెగుళ్లు-వ్యాధుల నిర్వహణ, నీటిపారుదల ప్రణాళిక, పంట కోతానంతర మార్గదర్శనం, విత్తనాల లభ్యత సహా మొత్తం పంట చక్రాన్ని కవర్ చేస్తుంది.

దేశంలోని వివిధ వ్యవసాయ-వాతావరణ మండలాల్లోని అన్ని ప్రధాన నూనెగింజల పంటలకు సమగ్ర కవరేజీని నిర్ధారిస్తూ... ఐసీఏఆర్-నేషనల్ సోయాబీన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఇండోర్ (ఐసీఏఆర్-ఎన్ఎస్ఆర్ఐ), ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్రౌండ్‌నట్ రీసెర్చ్, జునాగఢ్ (ఐసీఏఆర్-ఐఐజీఆర్), ఐసీఏఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాప్‌సీడ్ అండ్ మస్టర్డ్ రీసెర్చ్, బ ం త ప్రా ం (ఐసీఏఆర్-ఐఐఆర్ఎమ్ఆర్), పీసీ-యూనిట్ (నువ్వులు, నైజర్)లు సమష్టిగా ఈ విజ్ఞాన వ్యవస్థను రూపొందించాయి.

# అవినీతి అక్రమాలతోనే రెండేళ్లు..

**-ఒక్క మంచి పని చేసామని చెప్పే ధైర్యం ఉందా?**
**-రెండేళ్ల పాలనపై చర్చకు సిద్ధం..**
**-ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్..**
**-వెన్నుపోటు' పాలనకు రెండేళ్లు.. వైసీపీ నిరసన ర్యాలీ**
**-కూటమి మేనిఫెస్టో దహనం చేసిన వైసీపీ శ్రేణులు**
**-హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న దేవినేని అవినాష్**
**-2029లో ప్రజలే కూటమికి గుణపాఠం చెబుతారని హెచ్చరిక**

విజయవాడ, జూన్ 12:అవినీతి అక్రమాలు దౌర్జన్యంతోనే రెండేళ్ల పాటు కోటమి పాలన కొనసాగిందని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ విమర్శించారు. రెండేళ్లలో ఒక్క మంచి పని అయినా చేశామని చెప్పుకునే ధైర్యం కూటమి ప్రభుత్వానికి లేదన్న ఆయన ఈ రెండేళ్ల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో విజయవాడలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ వైసీపీ శ్రేణులు కూటమి మేనిఫెస్టో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజలు ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. మరోవైపు కూటమి




ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను రెండేళ్లు గడిచినా అమలు చేయలేకపోయారని, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి కీలక పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

రెడ్‌బుక్ పేరుతో రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ వైసీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేశారని అవినాష్ విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా అవినీతి, అక్రమ సంపాదనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రిటైనింగ్ వాల్‌లు, ఫ్లైఓవర్లు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణంతో విజయవాడ నగర ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణం పేరుతో విజయవాడ ప్రజలను మోసం చేస్తున్నారని, నగరాభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో వారి సమస్యలు తెలుసుకునేందుకు కూటమి నాయకులు ముందుకు రావడం లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పుకోదగ్గ ఒక్క మంచి పని కూడా చేయలేదని ఆరోపించిన అవినాష్, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# ప్రజల ఆశీర్వాదంతో రాష్ట్ర పునర్నిర్మాణం: సీఎం చంద్రబాబు

**-గెలుపుగా కాకుండా బాధ్యతగా ప్రజల తీర్పును స్వీకరించాం**
**-కేంద్ర సహకారంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త ఊపు**
**-సంక్షేమం, సుపరిపాలనతో ప్రజల విశ్వాసం పొందుతున్నాం**
**-పెట్టుబడులు, పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశాలు**


తిరుపతి, జూన్ 12: రెండేళ్ల క్రితం ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతను స్వీకరించి పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుపతి సమీపంలోని దామినేడు వద్ద నిర్వహించిన కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభలో ఆయన ప్రసంగించారు.

2024 ఎన్నికల ఫలితాలను రాజకీయ విజయంగా కాకుండా రాష్ట్ర పునర్నిర్మాణ బాధ్యతగా స్వీకరించామని చంద్రబాబు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో కలిసి ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఇచ్చిన పిలుపుకు ప్రజలు విశేష మద్దతు ఇచ్చారని పేర్కొన్నారు. 57 శాతం ఓటు షేర్‌తో 164 అసెంబ్లీ స్థానాలను ఎన్డీఏ కూటమికి కట్టబెట్టారని గుర్తు చేశారు. పాలకులుగా కాకుండా ప్రజల సేవకులుగా పని చేస్తున్నామని స్పష్టం చేశారు.

తాము అధికారంలోకి వచ్చే సమయానికి రాష్ట్రంలోని అన్ని రంగాలు సంక్షోభంలో ఉన్నాయని, పరిపాలనా వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. గత పాలనలో రాష్ట్రం భారీ అప్పుల ఊబిలో చిక్కుకుపోయిందని, పెట్టుబడులు, అభివృద్ధి ప్రాజెక్టులు నిలిచిపోయాయని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర ఆర్థిక, పరిపాలనా పరిస్థితులపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేసి వాస్తవాలను ప్రజలకు వివరించామని చెప్పారు.

ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడ్డాయని, విధ్వంసమైన వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టగలిగామని చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం, అమరావతి, విశాఖ ఉక్కు కర్మాగారం, రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. కేంద్ర?రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన దేశ అభివృద్ధికి దిక్సూచిగా నిలిచిందని చంద్రబాబు కొనియాడారు. 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడం, జాతీయ రహదారులు, విమానాశ్రయాల నిర్మాణం, చంద్రయాన్, గగన్‌యాన్ వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలు దేశ ప్రతిష్ఠను పెంచాయని అన్నారు. వరుసగా మూడు సార్లు ప్రజలు మోదీకి మద్దతు ఇవ్వడం ఆయన



నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందిస్తామని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా వేలాది కోట్ల రూపాయల పెన్షన్లు అందించామని, తల్లికి వందనం, స్త్రీశక్తి వంటి పథకాల ద్వారా మహిళలకు ప్రయోజనాలు కల్పిస్తున్నామని చెప్పారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద కేంద్ర సహకారంతో ఆర్థిక సాయం అందిస్తున్నామని, ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని వివరించారు.

ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తూ మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది ఉపాధ్యాయులను, 5,757 మంది కానిస్టేబుళ్లను నియమించామని తెలిపారు. ఉద్యోగులకు రూ.21 వేల కోట్ల బకాయిలను చెల్లించామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు సోలార్ రూఫ్‌టాప్ పథకాలు, పీ-4 కార్యక్రమం, సంజీవని ప్రాజెక్టు వంటి పథకాల ద్వారా జీవన ప్రమాణాలు మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 175 ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని, పెట్టుబడిదారులకు వేగవంతమైన అనుమతుల కోసం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. పుట్టపర్తిలో 5వ తరం ఫైటర్ జెట్ తయారీ ప్రాజెక్టు, తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ పరిశ్రమ, విశాఖలో ఐటీ పెట్టుబడులు వంటి ప్రాజెక్టులు యువతకు భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్, డిఫెన్స్, డ్రోన్, స్పేస్ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ.1 లక్ష కోట్ల ప్రణాళికలు అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజల సహకారం అవసరమని, ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.






## రుషికొండ సాగరతీరంలో యోగాంధ్ర కార్యక్రమం

**-12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖలో యోగా వేడుకలు**
**-జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ**

విశాఖపట్నం,జూన్ 12: అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం రుషికొండ సాగరతీరంలో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

జిల్లా యంత్రాంగం, ఆయుష్ శాఖ, పర్యాటక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. రుషికొండ బీచ్ వద్ద నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి వైజ్ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి తదితరులు ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ, జేసీతో పాటు అధికారులు యోగా ఆసనాలు చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. సముద్రతీర వాతావరణంలో యోగా సాధనతో పాల్గొన్నవారిలో ఉత్సాహం కనిపించింది.

## పర్యావరణాన్ని కాపాడుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలి..

నిర్మల్‌జూన్ 12: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రవిబాబు పిలుపునిచ్చారు.

శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి ఆదేశాల మేరకు కిరాణా దుకాణాలు, ప్లాస్టిక్ వస్తువుల వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా నిలిపివేసి, బట్ట సంచులను ప్రోత్సహించాలని కోరారు. ప్లాస్టిక్ నిషేధ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, కిరాణా దుకాణాల యజమానులు, వ్యాపారులు పాల్గొన్నారు.

# కీలక నిర్ణయాలు తీసుకోవడంలో కాంగ్రెస్ వెనుకంజ

హైదరాబాద్, జూన్ 12:కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తోందని తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఉద్యమకారులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో స్పష్టమైన నిర్ణయాలు తీసుకోకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు.



317 జీవో సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ, దానికి సవరణగా 190 జీవోను తీసుకొచ్చిందని గుర్తుచేశారు. అయితే 190 జీవో విడుదలై దాదాపు తొమ్మిది నెలలు గడిచినా ఇప్పటి వరకు అమలు చేయలేదని మండిపడ్డారు. 317 జీవో వల్ల ఉపాధ్యాయులతో పాటు పలు శాఖల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బాధితులను వారి స్వస్థలాలకు పంపిస్తామని, అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ ఆ హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. 190 జీవో అమలుకు రేషనలైజేషన్‌తో సంబంధం లేదని, ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే అదనపు పోస్టులు సృష్టించి జీవో అమలు చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల హక్కుల కోసం తెలంగాణ రక్షణ సేన పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్న నాయకులు, వెంటనే 190 జీవోను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# గుండెపోటుతో ఉపాధి హామీ మహిళా మృతి..



నల్గొండ, జూన్ 12: కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన వేముల పుల్లమ్మ భర్త వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం ఉపాధి హామీ పనులు చేస్తుండగా గుండెపోటుతో మృతి చెందారు.

సహచర కూలీల సమాచారం మేరకు, పనులు నిర్వహిస్తున్న సమయంలో ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. అక్కడే ఆయన మృతి చెందినట్లు తెలిపారు.


వెంకటేశ్వర్ల ఆకస్మిక మృతితో ఉపాధి హామీ కూలీలుగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

సమాచారం అందుకున్న మండల అభివృద్ధి అధికారి ఇసాక్ హుస్సేన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

# యూరియా యాప్ పై అవగాహన పెంపొందించుకోవాలి : చైర్మన్

ఆదిలాబాద్, జూన్ 12:ప్రభుత్వ నిర్ణీత ధరకే రైతులకు ఎరువులు సరఫరా చేయాలన్న సదాశయంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన యూరియా యాప్ పై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ రావు అన్నారు. శుక్రవారం సిర్పూర్ (యు) మండల కేంద్రంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ రైతులనుద్దేశించి మాట్లాడారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని గతంలో దళారులు మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించేవారని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయేవారని గుర్తు చేశారు. యూరియా యాప్ ద్వారా యూరియా బ్లాక్ మార్కెట్ కు తరలిపోకుండా నియంత్రించడమే కాకుండా దుకాణాల వద్ద రోజువారీగా నిల్వ లు ఎంత మేర ఉన్నాయో ఎప్పటికప్పుడు యాప్ లోతెలుసుకోవచ్చన్నారు. రైతులు పట్టా పాసుపుస్తకాలు దళారులకు ఇస్తే యాప్ లో స్లాట్ బుక్ చేసి యూరియా పక్కదారి మలించే అవకాశముందన్నారు.. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ కేంద్రే శివాజీ, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పెందుర్ గణపత్ రావు, సర్పంచు విజయలక్ష్మి బీర్షావ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆత్రం నాగో రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తోపాజి



సంగారెడ్డి, జూన్ 12:: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన తోపాజి అనంత కిషన్ శనివారం హైదరాబాద్‌లోని చంపాపేటలో ఉన్న సామ సరస్వతి గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. అనంతరం తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన ఆర్యవైశ్య మహాసభ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజ అభివృద్ధి, ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నూతన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపాజి అనంత కిషన్‌కు అభినందనలు తెలియజేస్తూ, సంస్థ అభివృద్ధికి ఆయన సేవలు ఎంతో ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహాసభ రాష్ట్ర, జిల్లా నాయకులు, సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని నూతన రాష్ట్ర ఉపాధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

# రాజకీయాలకతీతంగా స్కూళ్ల అభివృద్ధి

**–సమాజ సేవకే తొలి ప్రాధాన్యత**
**–డైనింగ్ హాల్, గదుల నిర్మిస్తా..**
**–కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

కరీంనగర్, జూన్ 12:రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తానని, సమాజ సేవకే తన తొలి




ప్రాధాన్యత అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ పాఠశాలలో టిఫిన్ బైఠక్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సద్ది తెచ్చుకుని.. స్థానికులతో కలిసి ఆరగించారు. అనంతరం రేకొండ స్కూల్లో పరిశుభ్రతపై ఆయన చర్చించారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా స్కూల్ను శుభ్రపరచాలని, ఎంపీ అయ్యాక సమాజసేవకే ప్రాధాన్య తనిస్తున్నానని వెల్లడించారు.

స్కూల్ సమస్యలను అడిగి తెలుసుకున్న కేంద్ర మంత్రి విద్యార్థులకు డైనింగ్ సౌకర్యం లేదని టీచర్లు చెప్పడంతో వెంటనే స్పందించి డైనింగ్ హాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ప్రాథమిక పాఠశాలకు తరగతి గదుల సమస్య ఉందని ఏకరువు పెట్టగా, సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల డైనింగ్ కోసం రూ.5 లక్షల సాయం చేస్తానని ప్రకటించారు.

అలాగే ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల నిర్మాణానికి రూ.20 లక్షల సాయం చేస్తానని, తొలి విడతగా రూ.10 లక్షలు అందిస్తానని హామీ ఇచ్చారు. రేకొండ స్కూల్లో టెన్త్ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కేంద్ర మంత్రి అభినందించారు. ఈసారి కూడా టెన్త్ విద్యార్థుందరికీ ఉచితంగా సైకిళ్లు అందిస్తానని స్పష్టం చేశారు. మోదీ 12 ఏళ్ల పాలనా విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని స్థానికులను కోరారు. అనంతరం మోదీ పాలనా విజయాల బుక్ లెట్లను హెచ్‌ఎం విజయ లక్ష్మికి కేంద్ర మంత్రి బండి సంజయ్ అందజేశారు.

# లంచం తీసుకుంటూ పట్టుబడిన నర్సింహులపేట ఎంపీడీవో, ఎంపీఓ

మహబూబాబాద్: జూన్ 12: మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన ట్రాప్‌లో ఎంపీడీవో పెనుగొండ రాధిక, ఎంపీఓ కిన్నెర యాకయ్య, ఎంపీడీవో కుమారుడు పెనుగొండ నాగార్జునలను శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు నర్సింహులపేట మండలంలోని పడమటి గూడెం గ్రామ పరిధిలో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసి వెంచర్ అనుమతుల కోసం దరఖాస్తు చేశారు. అనంతరం సంబంధిత అనుమతులు మంజూరయ్యాయి. అయితే అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఆ భూమిపై తనకే హక్కు ఉందంటూ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో మండల అధికారులకు నోటీసులు జారీ అయ్యాయి.

ఈ వివాదాన్ని పరిష్కరిస్తామని, కోర్టు నోటీసుల వ్యవహారాన్ని తామే చూసుకుంటామని చెప్పిన అధికారులు బాధితుల నుంచి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో గత నెలలో ఎంపీడీవోకు రూ.30 వేలు, ఎంపీఓకు రూ.25 వేలు చెల్లించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, మరింత డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు బాధితులు తెలిపారు. దీంతో బాధితులు ఏసీబీ వరంగల్ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా ట్రాప్ నిర్వహించిన ఏసీబీ అధికారులు ఇవాళ ఎంపీడీవో కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సమయంలో ఎంపీడీవో రాధిక, ఎంపీఓ యాకయ్యలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు.

ఆహ్వానం
శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
మరియు
ప్రపంచ రికార్డులలో స్థానం పొందిన ఆడిటోరియం
శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో
శ్రీ కళా సుబ్బారావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్.
తేది : 19-06-2026, శుక్రవారం, సమయం : సా॥ 6.00 గంటలకు

" శ్రీమతి ఏకాపద్మ స్మారక పురస్కార ప్రధానోత్సవ సభ "
ముఖ్య అతిథి : లయన్ డా॥ వై. ఎమ్. ధర్, లయన్స్ క్లబ్, మాజీ గవర్నర్
సభాధ్యక్షులు : శ్రీ పి. పవన్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్త
విశిష్ట అతిథి : శ్రీ కళా జనార్ధన మూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ
గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు, సంపాదకులు, నేటి నిజం
పురస్కార గ్రహీత : శ్రీమతి డా॥ పి. భవాని, కన్సల్టింగ్ హోమియో ఫిజీషియన్
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీమతి కె. కామేశ్వరి, ట్యాక్స్ కన్సల్టెంట్
ఆత్మీయ అతిథి : శ్రీమతి పొత్తూరి జయలక్ష్మీ, మేనేజర్ సాహితీ కిరణం
పురస్కార ప్రదాత : శ్రీ ఏకా నాగరాజు రామమోహన్ రావు, ప్రొప్రైటర్, పద్మ ఆప్టికల్స్
వందన సమర్పణ : శ్రీమతి ఏకా వేంకట ధర్మ సంవర్ధని
లంకా వెంకట సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు, శ్రీమతి భాను, కార్యదర్శి
శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య
ప్లాట్ నెం. 308, శ్రీ మణికంఠ అపార్టుమెంట్స్, కళ్యాణ్ నగర్, ఈస్ట్ ఆనంద్‌బాగ్,
మల్కాజ్‌గిరి, హైదరాబాద్ - 500 047. సెల్ : 94404 48650.


# ప్రజల తీర్పుతో రాష్ట్రానికి కొత్త దిశ లభించింది..



**–2024 ఎన్నికలు కేవలం ఫలితం కాదు, చరిత్రను మార్చిన తీర్పు**
**–అహంకారం, భయ రాజకీయాలను ప్రజలు తిరస్కరించారు**
**–కూటమి అధికారాన్ని కాదు, బాధ్యతను పంచుకోవడానికి ఏర్పడింది**
**–జనసేన 21 స్థానాలతో రాజీ పడలేదు, రాష్ట్ర భవిష్యత్తుకు ప్రాధాన్యం ఇచ్చింది**
**–గ్రామ స్వరాజ్యమే నిజమైన ప్రజాస్వామ్యానికి పునాది**
**–గ్రామ స్థాయిలో బలమైన పరిపాలన ద్వారానే సమగ్ర అభివృద్ధి**
**–స్థానిక సంస్థలను బలహీనపరిస్తే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది**
**–పంచాయతీలకు రాజ్యాంగ హోదా ఉన్నా పూర్తి స్థాయి సాధికారత జరగలేదు**
**–పంచాయతీరాజ్ వ్యవస్థను పునరుజ్జీవింపజేయడమే లక్ష్యం**
**–గ్రామ సభల బలోపేతమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం**
**–అధికార వికేంద్రీకరణ ద్వారానే సమర్థవంతమైన పాలన**
**–గ్రామాల్లోనే సమస్యలకు పరిష్కారాలు వెతకాలన్న ఉప ముఖ్యమంత్రి**
**–పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజాస్వామ్య నాయకత్వానికి పునాది**
**–గ్రామాభివృద్ధికి రాజకీయ స్థిరత్వం కీలకమని వ్యాఖ్య**
**–గ్రామాల అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యం**
**–స్వర్ణ పంచాయతీ ద్వారా గ్రామాల ఆర్థిక సామర్థ్యం పెరుగుతోంది**
**–పంచాయతీల బలోపేతమే దేశాభివృద్ధికి పునాది**
**–ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదన్న ఉప ముఖ్యమంత్రి**
**–గ్రామం నుంచి దేశం వరకు బాధ్యతాయుత అభివృద్ధి యాత్ర కొనసాగుతుంది: పవన్ కళ్యాణ్**

తిరుపతి, జూన్ 12:పధానమంత్రి నరేంద్ర మోదీ భారత రాజకీయ చరిత్రలో సుదీర్ఘకాలం సేవలందిస్తున్న ప్రధానమంత్రిగా నిలిచారని, గతంలో జవహర్‌లాల్ నెహ్రూ నెలకొల్పిన రికార్డును అధిగమించి కొత్త చరిత్ర సృష్టించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. దామినేడు వద్ద నిర్వహించిన విజయోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. వాస్తవానికి జూన్ 9న నిర్వహించాల్సిన విజయోత్సవ సభను ఆ దుర్ఘటన నేపథ్యంలో వాయిదా వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారని గుర్తుచేశారు.

అలాంటి విషాద సమయంలో విజయోత్సవ సభ నిర్వహించడం సమంజసం కాదని భావించి కార్యక్రమాన్ని వాయిదా వేయడం పెద్దమనసుతో తీసుకున్న నిర్ణయమని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి సభ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని పవన్ కళ్యాణ్ అన్నారు. దేశం లేదా రాష్ట్రం ఏ దిశగా వెళ్లాలో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. ప్రజలు తమ తీర్పు ద్వారా బలంగా మాట్లాడినప్పుడు అది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాకుండా ఒక సందేశం, హెచ్చరిక, దిశానిర్దేశం కూడా అవుతుందని పేర్కొన్నారు.

2024 ఎన్నికల్లో ప్రజలు ఒక రాజకీయ సంస్కృతిని తిరస్కరించారని, భయాన్ని తిరస్కరించారని, అహంకారాన్ని తిరస్కరించారని ఆయన అన్నారు. అధికారమే అంతా అన్న భావజాలాన్ని ప్రజలు అంగీకరించలేదని, ప్రజాస్వామ్యంలో ప్రజలకంటే ఎవరూ గొప్పవారు కారని మరోసారి స్పష్టం చేశారని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రజలు కేవలం ఓటు వేయడమే కాకుండా చరిత్రను కూడా రాస్తారని, 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు అదే చేశారని వ్యాఖ్యానించారు.

ఆ ఎన్నికల తీర్పు రాష్ట్రానికి కొత్త ఆశను ఇచ్చిందని, సమాజానికి ఆత్మవిశ్వాసాన్ని కల్పించిందని, యువత భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచిందని చెప్పారు. ప్రజలు మౌనంగా కనిపించినా అవసరమైన సమయంలో చరిత్రను మార్చగలరని మరోసారి నిరూపించారని అన్నారు. రెండేళ్ల క్రితం ప్రజలు కూటమికి ఇచ్చింది కేవలం అధికారం కాదని, ఒక బాధ్యత అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆ బాధ్యతను గుర్తుంచుకుంటూనే ప్రభుత్వం ముందుకు సాగుతోదన్నారు. ఈ విజయానికి కారణమైన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి, మహిళకు, రైతుకు, యువకుడికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ విజయం కేవలం తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ లేదా జనసేన పార్టీ విజయం మాత్రమే కాదని, ఇది ప్రజల విజయమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయంగా దీనిని అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం కూటమి ఏర్పడిందని ఆయన తెలిపారు. అధికారాన్ని పంచుకోవడం కోసం కాదు, బాధ్యతను పంచుకోవడం కోసం ఈ కూటమి ఏర్పడిందన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుభవం, ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే జనసేన సంకల్పం కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాది వేశాయని పేర్కొన్నారు. కూటమిలో జనసేనకు 21 స్థానాలు మాత్రమే కేటాయించినప్పుడు అనేక విమర్శలు వచ్చాయని పవన్ కళ్యాణ్ గుర్తు చేశారు. అయితే జనసేన 21 స్థానాలతో రాజీ పడలేదని, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆ పరిమితిని అంగీకరించిందని చెప్పారు. ఆ నిర్ణయానికి ప్రజలు ఇచ్చిన సమాధానమే వంద శాతం స్ట్రైక్ రేట్ అని వ్యాఖ్యానించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. వృద్ధాప్య పెన్షన్ల పెంపు, మహిళలకు ఆర్థిక భరోసా, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్న క్యాంటీన్లు, విద్యకు ప్రాధాన్యం, యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. తాను నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ గురించి ప్రస్తావిస్తూ, మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రతిపాదించిన అంత్యోదయ సిద్ధాంతం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన స్థానిక స్వపరిపాలన భావనల సమన్వయమే నేటి పాలనా తత్వమని చెప్పారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం "సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్'' సిద్ధాంతంతో పనిచేస్తోందని పేర్కొన్నారు. గ్రామాన్ని దేశాభివృద్ధికి కేంద్రబిందువుగా మార్చాలనే లక్ష్యంతో పంచాయతీరాజ్ శాఖ పనిచేస్తోందని పవన్ కళ్యాణ్ తెలిపారు. గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజలకు చివరి వ్యక్తి వరకు పాలన చేరే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామ స్థాయిలో అభివృద్ధి జరిగితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

ఒక రైతు ఆశ, ఒక మహిళ ఆత్మవిశ్వాసం, ఒక యువకుడి ఉపాధి, ఒక కుటుంబం ఆరోగ్యం వంటి అంశాలన్నీ మొదట గ్రామ స్థాయిలోనే ప్రభావితమవుతాయని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలకు అత్యంత దగ్గరగా ఉండేది గ్రామ పరిపాలనా వ్యవస్థేనని, అందుకే గ్రామాలు బలపడితేనే దేశం బలపడుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిపాలనలో "ప్రిన్సిపుల్ ఆఫ్ సబ్సిడియారిటీ" అనే సూత్రాన్ని అనుసరిస్తారని ఆయన వివరించారు. ప్రజలకు అత్యంత దగ్గరగా, అత్యంత సమర్థవంతంగా ఏ పని ఎక్కడ చేయగలవో ఆ పని అక్కడే జరగాలనేదే ఆ సూత్రం ఉద్దేశమన్నారు. గ్రామ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు మండల లేదా జిల్లా స్థాయికి వెళ్లకూడదని, అలా జరగకపోతే చివరకు ప్రతి చిన్న సమస్య కూడా ఎమ్మెల్యేల వద్దకు చేరే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు.

అధికారాన్ని కేంద్రీకరించడం ప్రజాస్వామ్యం కాదని, అధికారాన్ని ప్రజల దగ్గరకు తీసుకెళ్లడమే నిజమైన ప్రజాస్వామ్యమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఒక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గంలో దాదాపు 600 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఉంటారని, వారిలో సర్పంచులు, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సహకార సంఘాల ప్రతినిధులు ఉంటారని తెలిపారు. వీరే ప్రజాస్వామ్యానికి మూలాలు, వేళ్లు అని పేర్కొన్నారు. మూలాలను బలహీనపరిచి చెట్టును బలపరచలేమని, స్థానిక సంస్థలను బలహీనపరిచి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయలేమని ఆయన అన్నారు. ఇది కేవలం పరిపాలనా సూత్రం మాత్రమే కాదని, ప్రజాస్వామ్య సూత్రం, బాధ్యత సూత్రమని వ్యాఖ్యానించారు.

నాయకత్వం గ్రామాల నుంచి రావాలని, గ్రామ స్థాయి సంస్థలు బలపడితేనే ప్రజాస్వామ్యం బలపడుతుందని చెప్పారు. గత రెండేళ్లలో ప్రభుత్వం కేవలం రోడ్లు, కాలువలు, భవనాల నిర్మాణంపైనే కాకుండా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే దిశగా కూడా కృషి చేసిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఒక వ్యవస్థ బలహీనపడినప్పుడు ముందుగా కోల్పోయేది డబ్బు కాదని, నమ్మకమని చెప్పారు. వ్యవస్థ న్యాయం చేయకపోతే కులాలు ముందుకు వస్తాయని, వ్యవస్థపై విశ్వాసం తగ్గితే ప్రాంతీయత పెరుగుతుందని అన్నారు. సమాజం చిన్న చిన్న వర్గాలుగా విడిపోకుండా ఉండాలంటే వ్యవస్థలపై ప్రజల నమ్మకం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

తెలుగు రాష్ట్రాలు మరింత బలపడాలంటే కుల, ప్రాంతీయ పరిమితులను అధిగమించి భారతీయత వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అందుకే తాను పంచాయతీరాజ్ గురించి మాట్లాడేటప్పుడు కేవలం పథకాలు, పనుల గురించే కాకుండా ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, సామాజిక ఐక్యత, జాతీయ సమైక్యత, భారతీయత, సామాజిక విశ్వాసం వంటి అంశాల గురించి కూడా మాట్లాడుతానని చెప్పారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి దేశంలో అనేక కమిటీలు పనిచేశాయని ఆయన గుర్తు చేశారు.

బలవంత్‌రాయ్ మెహతా కమిటీ, అశోక్ మెహతా కమిటీ, జి.వి.కె. రావు కమిటీ, ఎల్.ఎం. సింఘ్వీ కమిటీలు చేసిన సిఫారసుల ఫలితంగానే 73వ రాజ్యాంగ సవరణ అమలులోకి వచ్చిందన్నారు. 1993 నుంచి పంచాయతీరాజ్ సంస్థలకు రాజ్యాంగ హోదా లభించిందని తెలిపారు. రాజ్యాంగంలోని 243వ అధికరణం నుంచి 243–ఓ వరకు పంచాయతీరాజ్ వ్యవస్థకు రక్షణ కల్పించబడిందని, 11వ షెడ్యూల్ ద్వారా 29 అంశాలు గ్రామీణ స్వపరిపాలన పరిధిలోకి వచ్చాయని వివరించారు. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రయోగమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 2.6 లక్షల గ్రామ పంచాయతీలు, 30 లక్షలకు పైగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారని, వారిలో 14 లక్షలకు పైగా మహిళలు ఉన్నారని తెలిపారు.

అయితే రాజ్యాంగం అధికారాలను ఇచ్చినప్పటికీ, ఆ స్ఫూర్తి పూర్తిస్థాయిలో అమలు కాలేదనే ప్రశ్న ఇంకా మిగిలే ఉందని పవన్ కళ్యాణ్ అన్నారు. నిధులు నిజంగా గ్రామాలకు చేరాయా, నిర్ణయాధికారం గ్రామాలకు వెళ్లిందా, బాధ్యత గ్రామాలకు అప్పగించబడిందా అనే అంశాలను తాను పంచాయతీరాజ్ శాఖ బాధ్యతలు చేపట్టిన తర్వాత లోతుగా అధ్యయనం చేశానని చెప్పారు. శాఖ బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల పరిస్థితిని పరిశీలించగా ఆందోళనకర పరిస్థితులు కనిపించాయని తెలిపారు.

గ్రామ పంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేయడానికి కూడా డబ్బులు లేవని, చిన్నచిన్న కార్యక్రమాలు నిర్వహించేందుకు కూడా నిధులు లేవని సర్పంచులు తనకు వివరించారని చెప్పారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన కేంద్ర నిధులు నిలిచిపోవడం, అనేక పంచాయతీలు అప్పుల బారిన పడడం, విద్యుత్ బకాయిలు వేల కోట్ల రూపాయలకు చేరుకోవడం, గ్రామ స్థాయి పరిపాలన బలహీనపడడం వంటి పరిస్థితులను ప్రభుత్వం వారసత్వంగా స్వీకరించిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. సర్పంచుల గౌరవం కూడా దెబ్బతిన్న పరిస్థితి నెలకొందని అన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థపై సమగ్ర అధ్యయనం చేసిన తర్వాత సమస్య కేవలం నిధుల కొరత మాత్రమే కాదని తమకు అర్థమైందన్నారు.

పంచాయతీలకు అవసరమైన అధికారాలు, ఆర్థిక స్వావలంబన, నిర్ణయాధికారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని గుర్తించామని తెలిపారు. పంచాయతీలకు రాజ్యాంగం హోదా ఇచ్చినా, వాటికి జీవం పోసే బాధ్యత ప్రభుత్వాలపైనే ఉంటుందని పేర్కొంటూ, గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా నిజమైన ప్రజాస్వామ్యాన్ని గ్రామ స్థాయిలో స్థాపించడమే తమ లక్ష్యమని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రధాన సమస్య నిధుల కొరత మాత్రమే కాదని, బాధ్యతలు, అధికారాలు, జవాబుదారీతనం మధ్య స్పష్టత లేకపోవడమే అసలు సమస్య అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. అధికారం ఒకచోట, బాధ్యత మరోచోట, జవాబుదారీతనం ఇంకోచోట ఉంటే పాలనలో అంతరాలు ఏర్పడతాయని చెప్పారు. దీనిని ''బ్రోకెన్ గవర్నెన్స్ చైన్''గా అభివర్ణించారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు గ్రామ సమస్యలకు పరిష్కారాలు గ్రామాల్లోనే వెతకాలనే ప్రాథమిక సూత్రాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిందని తెలిపారు.

ప్రజల జీవితాలను ప్రభావితం చేసే నిర్ణయాలు ప్రజల సమక్షంలోనే జరగాలని, అందుకే గ్రామసభలను కేవలం అధికారిక సమావేశాలుగా కాకుండా గ్రామ ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువులుగా మార్చేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామానికి అవసరమైన రోడ్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య సమస్యలు, గృహ అవసరాలు వంటి అంశాలపై నిర్ణయాలు కార్యాలయాల్లో కాకుండా గ్రామసభల్లో జరగాలని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రభుత్వానికి కనిపించని సమస్యలు ప్రజలకు కనిపిస్తాయని, అధికారులకు తెలియని అవసరాలు గ్రామస్థులకు బాగా తెలుసని అన్నారు.

గ్రామసభలు బలపడితే సర్పంచులు బలపడతారని, సర్పంచులు బలపడితే పంచాయతీలు బలపడతాయని, పంచాయతీలు బలపడితే ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని తెలిపారు. అప్పుడు ప్రతి చిన్న సమస్య స్థానిక ఎమ్మెల్యేల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. దీంతో ఎమ్మెల్యేలు తమ అసలు బాధ్యతలైన పరిశ్రమల ఏర్పాటు, ఉపాధి అవకాశాల కల్పన, యువత భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి వంటి అంశాలపై మరింత దృష్టి పెట్టగలుగుతారని వివరించారు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఒక రోజులో పుట్టదని, అది సమాజం నుంచి సహజంగా ఎదుగుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. గ్రామసభల్లో రూపుదిద్దుకుని, పంచాయతీల్లో తీర్చిదిద్దబడే నాయకత్వమని చెప్పారు.

అందుకే పంచాయతీరాజ్ వ్యవస్థ కేవలం స్థానిక పరిపాలనా వ్యవస్థ మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య నాయకత్వాన్ని తయారు చేసే పాఠశాల అని అభివర్ణించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్థానిక సంస్థల నుంచే రాజకీయ ప్రస్థానం ప్రారంభించారని గుర్తు చేశారు. ఒక నగర పంచాయతీ కౌన్సిలర్‌గా ప్రారంభమైన ఆమె ప్రయాణం రాష్ట్రపతి పదవి వరకు చేరుకుందని పేర్కొన్నారు. అలాగే డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం శాస్త్రరంగంలో, ఎస్.ఆర్. శంకరన్ పరిపాలనా రంగంలో నాయకత్వానికి ఆదర్శంగా నిలిచారని చెప్పారు. గొప్ప ఉపాధ్యాయుడు, నిజాయితీ గల అధికారి, సమర్థవంతమైన సర్పంచ్ కూడా నాయకుడేనని ఆయన అభిప్రాయపడ్డారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ భారతదేశంలో మహిళా రాజకీయ నాయకత్వానికి అతిపెద్ద వేదికగా నిలిచిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. 50 శాతం మహిళా రిజర్వేషన్ల ద్వారా వేలాది మంది మహిళలు నాయకత్వ స్థానాలకు వస్తున్నారని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. అలాగే వెనుకబడిన వర్గాలు, యువత నుంచి కూడా నాయకత్వం వెలుగులోకి వస్తోందన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలని తరచూ చెబుతుంటామని, అయితే వారికి తొలి అవకాశం గ్రామ స్థాయిలోనే లభిస్తుందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గ్రామస్థాయి ఎన్నికల్లో పాల్గొని ప్రజాసేవ చేయడం ద్వారా నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని చెప్పారు. ఇదే సామాజిక మూలధనం, ఇదే దేశ నిర్మాణానికి పునాది అని అన్నారు. గత రెండేళ్లలో ఈ ఆలోచనలను ఎంతవరకు ఆచరణలోకి తీసుకురాగలిగామనే అంశాన్ని ప్రస్తావిస్తూ, అభివృద్ధికి మొదటి అర్హత రాజకీయ స్థిరత్వమని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత రెండేళ్లుగా ఏర్పడిన రాజకీయ స్థిరత్వం గ్రామాభివృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్ణయాల్లో స్పష్టత వచ్చిందని, కేంద్ర?రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం బలపడిందని తెలిపారు. అదే స్థిరత్వాన్ని ఆధారంగా చేసుకుని పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాకుండా గ్రామాలను మళ్లీ పరిపాలనా కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రయత్నాలు ప్రారంభించామని చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని 13,326 గ్రామ పంచాయతీల్లో ఒకేసారి గ్రామసభలు నిర్వహించడం జరిగిందని పవన్ కళ్యాణ్ తెలిపారు

. ప్రజాస్వామ్యాన్ని ప్రతి గ్రామం, ప్రతి గడప వరకు తీసుకెళ్లే ప్రయత్నం చేశామని అన్నారు. ప్రతి పంచాయతీకి కార్యదర్శి వ్యవస్థను బలోపేతం చేశామని, స్థానిక అవసరాలకు అనుగుణంగా కొత్త పరిపాలనా విధానాలను రూపొందించామని చెప్పారు.

# హైదరాబాద్‌లో బొగ్గు.. లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై బొగ్గు మంత్రిత్వ శాఖ రోడ్‌షో విజయవంతం




న్యూఢిల్లీ, జూన్ 12:కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ రోజు హైదరాబాద్ నగరంలో బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై కీలక రోడ్‌షోను విజయవంతంగా నిర్వహించింది. పలువురు అగ్ర పారిశ్రామికవేత్తలు, సాంకేతిక సేవా ప్రదాతలు, పెట్టుబడిదారులు, ఆర్థిక సంస్థలు, బొగ్గు-లిగ్నైట్ కంపెనీలు, పరిశ్రమల సంఘాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశంలోని సమృద్ధ బొగ్గు వనరులను కాలుష్య రహితంగా, విలువ ఆధారితంగా వినియోగించుకునే దిశగా బొగ్గు గ్యాసిఫికేషన్‌ను వేగిరపరచడంపై కేంద్ర ప్రభుత్వ దూరదృష్టికి ఈ కార్యక్రమం ముఖ్యమైన వేదికగా నిలిచింది. ఈ నేపథ్యంలో పెట్టుబడి అవకాశాలు, విధానపరమైన సహాయక యంత్రాంగాలు, సాంకేతిక ప్రగతి, అమలు వ్యూహాలు సహా దేశంలో పటిష్ట బొగ్గు గ్యాసిఫికేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసే మార్గాలపై ఈ రోడ్‌షో సందర్భంగా విస్తృత చర్చలు సాగాయి.

గౌరవనీయ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొనగా, ఆ శాఖ సహాయ మంత్రి శ్రీ సతీష్ చంద్ర దూబే గౌరవ అతిథిగా హాజరయ్యారు. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి శ్రీ సనోజ్ కుమార్ ఝా, ఇతర సీనియర్ అధికారులు కూడా ఇందులో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీ శ్రీ జి.కిషన్ రెడ్డి ప్రధానోపన్యాసం చేశారు. దేశంలోని అపార వనరులను, పెరుగుతున్న ఇంధన అవసరాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా దాదాపు 400 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఈ సహజ సంపద రీత్యా భారత్ ప్రపంచంలో 5వ స్థానంలో ఉందని గుర్తుచేశారు. ఈ నిల్వలను వెలికితీస్తే అనేక దశాబ్దాలపాటు అవసరాలు తీరగలవని ఆయన పేర్కొన్నారు. భారత్ నేడు ప్రపంచంలో రెండో అతిపెద్ద బొగ్గు ఉత్పత్తిదారుగానే కాకుండా వినియోగదారుగానూ ఉన్నదని శ్రీ కిషన్ రెడ్డి చెప్పారు. దేశ విద్యుదుత్పాదన దాదాపు 70 శాతం బొగ్గు ఆధారితమేనని, దీంతోపాటు లక్షలాది మంది జీవనోపాధి ఈ రంగంతో ముడిపడి ఉందని ఆయన తెలిపారు. ఈ సమృద్ధ వనరును మరింత వివేచనతో వినియోగించుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. భారత ఇంధన-పారిశ్రామిక భవిష్యత్తుకు బొగ్గు గ్యాసిఫికేషన్ ఒక పరిణామాత్మక అవకాశమని ఆయన పేర్కొన్నారు.

దేశంలో బొగ్గు నిల్వలు విస్తృతంగా ఉన్నప్పటికీ మిథనాల్, అమ్మోనియా, ఎరువుల ఫీడ్‌స్టాక్ సహా అనేక కీలక పారిశ్రామిక రసాయనాల దిగుమతుల పరాధీనత ఇంకా తొలగలేదని మంత్రి చెప్పారు. ఫలితంగా ఏటా గణనీయ స్థాయిలో విదేశీ మారక ద్రవ్యం వెచ్చించాల్సి వస్తున్నదని శ్రీ కిషన్ రెడ్డి గుర్తుచేశారు. దేశీయ బొగ్గును విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చడం, ఇంధన భద్రతను బలోపేతం చేయడం, దిగుమతి పరాధీనతను తగ్గించడం, ఆర్థిక పునరుత్థానాన్ని ఇనుమడింపజేయడం తదితరాల దిశగా బొగ్గు గ్యాసిఫికేషన్ ఒక వ్యూహాత్మక మార్గం చూపుతుందన్నారు. పారదర్శక, సంప్రదింపుల సహిత అమలు ప్రక్రియకు భరోసా ఇస్తూ, ముసాయిదా ప్రతిపాదనల అభ్యర్థన ఇప్పటికే ప్రజలకు అందుబాటులో ఉందని తెలిపారు. దీనిపై సూచనలు, సలహాలు, అభిప్రాయాలు తెలిపేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలతోపాటు భాగస్వామ్య సంస్థలన్నిటికీ సూచించారు. తదనుగుణంగా ఈ చట్రాన్ని మరింత బలోపేతం చేయడానికి విలువైన సూచనలివ్వాలని ఆయన కోరారు.

ఉపరితల బొగ్గు/ లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించడం కోసం రూ. 46,000 కోట్లతో సంయుక్త పథకాన్ని కేంద్ర మంత్రివర్గం మొత్తం ఆమోదించడమన్నది దేశ ఇంధన, పారిశ్రామిక ప్రస్థానంలో విప్లవాత్మకమైన ముందడుగు అని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా భారీ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు ఇది నవోత్తేజాన్నిస్తుందన్నారు. సులభతర వాణిజ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ.. ఈ రంగంలో సంస్కరణలను ముందుకు తీసుకెళ్లడానికీ, పెట్టుబడిదారులకూ సాంకేతిక నిపుణులకూ అనుకూల వాతావరణాన్ని ఏర్పరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. సంప్రదింపులతో కూడిన, పరిశ్రమల అనుకూల, పెట్టుబడిదారుల ఆధారిత విధానంతోనే ఈ బొగ్గు గ్యాసిఫికేషన్ కార్యక్రమం విజయవంతమవుతుందని వివరిస్తూ... పారదర్శకత, జవాబుదారీతనాలకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వ్యాఖ్యానించారు. ఆ విషయంలో రాజీ పడేదే లేదనీ స్పష్టం చేశారు. బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలో పెట్టుబడులకు ప్రపంచంలో అత్యంత ఆశాజనక దేశంగా భారత్ నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కొత్త శకంలోకి అడుగు పెట్టేందుకు భారత్ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. "మన వద్ద బొగ్గు పుష్కలంగా ఉంది. విధానపరమైన మద్దతు మనకుంది. మనం అంకితభావంతో ఉన్నాం. పారిశ్రామిక వృద్ధికీ, ఆత్మనిర్భర్ భారత్‌కూ బొగ్గు గ్యాసిఫికేషన్ సరికొత్త చోదక శక్తిగా నిలుస్తుంది" అని కేంద్ర మంత్రి అన్నారు.

రోడ్‌షోనుద్దేశించి ప్రసంగిస్తూ.. ఆత్మనిర్భర, వికసిత భారత స్వప్నాన్ని సాకారం చేయడంలో బొగ్గు గ్యాసిఫికేషన్‌కు అత్యంత వ్యూహాత్మక ప్రాధాన్యముందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే వ్యాఖ్యానించారు. దేశీయ వనరుల ద్వారానే సొంతంగా ఇంధనాలు, ఎరువులు, రసాయనాలు, ఇతర కీలక పారిశ్రామిక ముడిపదార్థాలను ఉత్పత్తి చేసుకోగలిగే దేశం మరింత మెరుగ్గా దీర్ఘకాలిక ఇంధన భద్రతను సాధించడంతోపాటు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించుకుని, ఆర్థిక శక్తిని పెంచుకోగలదని ఆయన స్పష్టం చేశారు.

ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన రూ. 37,500 కోట్ల పథకం.. దేశంలో పుష్కలంగా ఉన్న బొగ్గు వనరులను మరింత సమర్థంగా, సుస్థిరంగా, ఎక్కువ విలువను పొందే పద్ధతిలో సద్వినియోగం చేసుకోవడానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనమని శ్రీ దూబే స్పష్టం చేశారు. గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆత్మనిర్భర భారత్ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఈ కార్యక్రమం కీలకమైన ముందడుగని ఆయన వ్యాఖ్యానించారు. ఈ రంగంలో రాబోయే విప్లవాత్మక మార్పులపై ధీమా వ్యక్తం చేస్తూ.. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా భారీగా పెట్టుబడులు వస్తాయని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించే అవకాశం లభిస్తుందని, దేశవ్యాప్తంగా భారీగా ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు పారిశ్రామిక వృద్ధి వేగవంతమవుతుందని శ్రీ దూబే అన్నారు. బొగ్గును అధిక విలువైన ఉత్పత్తులుగా మార్చడం ద్వారా.. గ్యాసిఫికేషన్ ప్రక్రియ దేశ పారిశ్రామిక సామర్థ్యాలను పెంచడమే కాకుండా, ఆర్థికాభివృద్ధికి సరికొత్త మార్గాలను ఆవిష్కరిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

దేశంలోని అపారమైన బొగ్గు నిల్వలను వృద్ధికీ, ఆవిష్కరణలకూ, స్వయంసమృద్ధికీ శక్తిమంతమైన చోదక శక్తిగా నిలిపే సామర్థ్యం బొగ్గు గ్యాసిఫికేషన్‌కు ఉందని ఆయన వ్యాఖ్యానించారు. 2047 నాటికి బలమైన, ఒడుదుడుకులను తట్టుకుని నిలవగల, వికసిత భారత్ నిర్మాణ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడంలో ఇదెంతగానో దోహదపడుతుందని శ్రీ దూబే ఆశాభావం వ్యక్తం చేశారు.

బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ విక్రమ్ దేవ్ దత్ తన ప్రారంభ ఉపన్యాసంలో.. ఉపరితల బొగ్గు/ లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందనీ, ఇది భారీ వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన కార్యక్రమమనీ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అధిక వ్యయంతో భారీ పరిమాణంలో దిగుమతి చేసుకుంటున్న ఇంధనాలు, ఎరువులు, రసాయనాలు, పారిశ్రామిక ముడి పదార్థాలను.. భారత్ సొంత వనరుల నుంచే ఉత్పత్తి చేసుకునేందుకు బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రక్రియ మార్గం సుగమం చేస్తుందన్నారు. భారత్‌లో ఉన్న అపారమైన బొగ్గు నిల్వలు దేశానికి ఒక వ్యూహాత్మక ఆస్తి అని వ్యాఖ్యానించారు. ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో, ఆత్మనిర్భరతను ముందుకు తీసుకెళ్లడంలో బొగ్గు గ్యాసిఫికేషన్ కీలక పాత్ర పోషిస్తుందని స్పష్టం చేశారు.

న్యూఢిల్లీ రోడ్‌షోలో ఇచ్చిన హామీ మేరకు.. పరిశ్రమ వర్గాల అభిప్రాయాలను సేకరించడం కోసం ముసాయిదా ప్రతిపాదనల అభ్యర్థన (ఆర్ఈపీ)ను బహిరంగంగా అందుబాటులో ఉంచినట్టు శ్రీ దత్ తెలిపారు. ఈ పథకాన్ని, ఆర్ఎఫ్‌పీ నిబంధనలను స్పష్టంగా వివరించడంతోపాటు భాగస్వామ్య పక్షాల ప్రశ్నలు, ఆందోళనలు, సూచనలను తెలుసుకోవడమే ఈ రోడ్‌షో ముఖ్య ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమ తుది రూపకల్పనలో తమవంతు సహకారాన్ని అందించాల్సిందిగా పారిశ్రామిక రంగాన్ని, సాంకేతిక నిపుణులను, ఆర్థిక సంస్థలను ఆయన ఆహ్వానించారు.

మారుతున్న భౌగోళిక-రాజకీయ పరిస్థితుల్లో స్వయం సమృద్ధికి ఉన్న ప్రాముఖ్యతను శ్రీ విక్రమ్ దేవ్ దత్ ప్రధానంగా చెప్పారు. పశ్చిమ ఆసియాలో ఇటీవలి పరిణామాలు దేశీయంగా బలమైన సరఫరా వ్యవస్థను తయారుచేసుకోవాల్సిన అవసరాన్ని, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన ఆవశ్యకతను మరింత స్పష్టం చేశాయని ఆయన పేర్కొన్నారు. కేంద్ర కేబినెట్ ఈ పథకానికి ఆమోదం తెలిపిందన్న ఆయన.. కేంద్ర ప్రభుత్వ మద్దతు, రాష్ట్రాల ప్రోత్సాహకాలు, నిరంతర బొగ్గు సరఫరా, డౌన్‌స్ట్రీమ్ మౌలిక సదుపాయాలు అన్నీ కలిసి పెట్టుబడులకు ఒక అద్భుతమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నాయని చెప్పారు. ఈ జాతీయ మిషన్‌లో భాగస్వాములు కావాలని పరిశ్రమలకు పిలుపునిస్తూ ఆయన "ఈ అవకాశం అపూర్వమైనది. ఇది ఎంతో అత్యవసరమైంది. ప్రభుత్వ మద్దతు కూడా ఉదారంగా ఉంది. ఇక ఆర్ఎఫ్‌పీ మీ చేతుల్లోనే ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ రోడ్‌షోలో 'ఉపరితల బొగ్గు, లిగ్నైట్ వాయువీకరణ ప్రాజెక్టుల ప్రోత్సాహక పథకం' పరిధిలోని 'ఆర్ఎఫ్‌పీ'పై (డ్రాఫ్ట్ రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) ఒక వివరణాత్మక ప్రెజెంటేషన్ కూడా ఇచ్చారు. ఈ ప్రెజెంటేషన్‌లో పథకానికి సంబంధించిన అర్హత ప్రమాణాలు, బిడ్డింగ్ విధానం, ప్రోత్సాహకాల నిర్మాణం, బొగ్గు అనుసంధాన నిబంధనలు, ప్రాజెక్ట్ కీలక ఘట్టాలు, ఎవాల్యుయేషన్ పారామితులు, భాగస్వామ్య కాలక్రమం వంటి కీలక అంశాలను వివరించారు. పారదర్శకమైన, సంప్రదింపుల ప్రక్రియలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉంచిన ఈ ముసాయిదా ఆర్ఎఫ్‌పీపై అభిప్రాయాలను, సూచనలను అందించాల్సిందిగా భాగస్వాములను కోరారు. భారత్‌కు ఉన్న సాంకేతిక స్వయంసమృద్ధి నిబద్ధతను చాటుతూ బీహెచ్ఈఎల్, సీఐఎంఎఫ్ఆర్ సంస్థలు స్వదేశీ బొగ్గు వాయువీకరణ (కోల్ గ్యాసిఫికేషన్) సాంకేతికతలను ప్రదర్శించాయి. క్లస్టర్ ఆధారిత అభివృద్ధి కోసం తమ రాష్ట్రం అందిస్తున్న పాలసీ ప్రోత్సాహకాలను మహారాష్ట్ర తెలియజేయగా.. పరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడానికి, బొగ్గు వాయువీకరణ (గ్యాసిఫికేషన్) వ్యవస్థ వృద్ధిని వేగవంతం చేయడానికి ఆకర్షణీయమైన పెట్టుబడి అవకాశాలు ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రకటించాయి.

ఈ రోడ్‌షోలో భాగంగా ఒక ఇంటరాక్టీవ్ సెషన్‌తో పాటు ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగస్వాములు ప్రాజెక్ట్ ఫైనాన్సింగ్, సాంకేతిక భాగస్వామ్యాలు, బొగ్గు లభ్యత, చట్టపరమైన అనుమతులు, పర్యావరణ అనుమతులు, మౌలిక సదుపాయాల అవసరాలు, డౌన్‌స్ట్రీమ్ అవకాశాలపై పలు వివరణలను కోరారు. పథకంలోని వివిధ నిబంధనలపై మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు వివరణాత్మక సమాధానాలను అందించారు. ఈ చర్చలు అభివృద్ధి చెందుతున్న బొగ్గు వాయువీకరణ రంగంపై పరిశ్రమలు, పెట్టుబడిదారులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే సంస్థలు, ఆర్థిక సంస్థలకు ఉన్న తీవ్ర ఆసక్తిని తెలియజేశాయి.

# కొచ్చికి వస్తున్న వాణిజ్య నౌక నుంచి పేలని క్షిపణిని సురక్షితంగా తొలగించిన భారత నౌకాదళం

న్యూ ఢిల్లీ, జూన్ 12:భారత నౌకాదళం ఒక సంక్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ముడి చమురు రవాణా చేసే 'ఎమ్టి ఒలింపిక్ లైఫ్' ట్యాంకర్ నౌక నుంచి పేలని ఒక క్షిపణి వారహెడ్‌ను నౌకాదళ సిబ్బంది సురక్షితంగా తొలగించింది.

యూఏఈలోని ఫుజైరా నుంచి కొచ్చికి వస్తున్న మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉన్న ఈ ట్యాంకర్ నౌకలో భారతీయులెవరూ లేరు. మే 26, 2026న ఒమన్ తీరానికి సమీపంలో ప్రయాణిస్తున్న సమయంలో ఈ నౌక కింది భాగంలో పేలుడు సంభవించినట్లు సమాచారం అందింది.

ఆ నౌక కొచ్చి వైపు తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న సమయంలోనే, దానిపై ఒక పేలని పేలుడు పదార్థం ఉన్నట్లు గుర్తించింది.

ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ - ఇండియన్ ఓషన్ రీజియన్ (ఐఎఫ్సీ- ఐఓఆర్) ద్వారా సమాచారం అందిన వెంటనే, భారత నౌకాదళం సమన్వయంతో కూడిన సహాయక చర్యలను ప్రారంభించింది. దీనిపై సమగ్రమైన అంచనా వేసేందుకు కొచ్చికి చెందిన సదరన్ నావల్ కమాండ్ ఒక ప్రత్యేక పేలుడు పదార్థాల నిర్వీర్య విభాగం (ఎక్స్‌ప్లోజివ్ ఆర్డినెన్స్ డిస్పోజల్) బృందాన్ని రంగంలోకి దించింది.

ఆ నౌకలో కి ఒక క్షిపణి చొచ్చుకుపోయిందని, అది నౌకలోని పలు అంతర్గత భాగాల గుండా ప్రయాణించి, చివరకు ఇంధన ట్యాంక్ లోపల ఉండిపోయిందని నిపుణుల బృందం ధ్రువీకరించింది.

ఇంధన ట్యాంక్ లోపల పేలని క్షిపణి వారహెడ్ ఉండటం వల్ల తలెత్తే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఆ నౌకకూ, అందులోని సిబ్బందికీ, చుట్టుపక్కల ఉన్న రేవు మౌలిక సదుపాయాలకు హాని కలగని విధంగా ఈఓడీ బృందం ఎంతో అప్రమత్తంగా, దశలవారీ విధానాన్ని అవలంబించింది.

నిర్దిష్ట భద్రతా విధానాలన్నింటినీ పూర్తి చేసిన తర్వాత ఈఓడీ బృందం అధునాతన గుర్తింపు వద్ధతులను ఉపయోగించింది.

క్షిపణి పేలేలా చేసే యంత్రాంగాన్ని గుర్తించి, దానిని వేరు చేసిన తర్వాత వారహెడ్‌తో పాటు దానికి సంబంధించిన శిథిలాలను సురక్షితంగా బయటకు తీశారు.

వెలికితీసిన ఆ పేలుడు పదార్థాన్ని సురక్షితంగా భద్రపరచడానికీ, సమగ్రంగా పరీక్షించడానికీ ఒక సురక్షిత ప్రాంతానికి తరలించారు.

దీర్ఘకాలం పాటు అత్యంత నిశితమైన ప్రణాళికతో, పకడ్బందీగా చేపట్టిన అత్యంత ప్రమాదకరమై ఈ ఆపరేషన్ సంక్లిష్టమైన సముద్ర విపత్తులను ఎదుర్కోవడంలో భారత నౌకాదళానికి ఉన్న పేలుడు పదార్థాల నిర్వీర్య నైపుణ్యాన్ని, సాంకేతిక ప్రతిభను, వివిధ ప్రభుత్వ విభాగాల మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని మరోసారి స్పష్టం చేసింది.

మర్చంట్ ట్యాంకర్ 'ఎమ్టి ఒలింపిక్ లైఫ్' యాజమాన్యం ఏ దేశానిదైనా, లేదా అందులోని సిబ్బంది ఏ జాతీయతకు చెందిన వారైనా సముద్రంలో ఎదురైన ఆపదకు భారత నౌకాదళం తక్షణమే స్పందించిన తీరు అంతర్జాతీయ సముద్ర భద్రతకు కట్టుబడిన బాధ్యతాయుతమైన నావికాదళంగా దాని పాత్రను చాటి చెబుతోంది.

ఈ ప్రాంతంలో అత్యంత నమ్మకమైన, ప్రాధాన్యత కలిగిన భద్రతా భాగస్వామిగా భారత్ కు ఉన్న ఖ్యాతిని ఇది మరింత ఇనుమడింపచేసింది.

# ఉద్యోగుల వేతనాల కోత అన్యాయం

## -ఆరోగ్య భద్రత విధి విధానాలు ప్రకటించండి
## -ప్రభుత్వానికి ప్రజలకు మధ్య ఉద్యోగులే వారదులు
## -సిద్దిపేట జిల్లా టిఎన్జీవోల సమావేశం..



సిద్దిపేట జూన్ 12: రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ కార్డులపై విధి విధానాలు సక్రమంగా లేకుండానే ఉద్యోగుల మూలవేతనం నుంచి కోత విధించడం సరికాదని సిద్దిపేట జిల్లా టీఎన్జీవోల సంఘం అభిప్రాయపడింది. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన జిల్లా టీఎన్జీవోల సంఘ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వర్, విక్రమ్ రెడ్డిలతో పాటు జిల్లా నలుమూలల నుంచి టీఎన్జీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పలు తీర్మానాలను చేశారు. ప్రభుత్వం హెల్త్ కార్డు విషయంలో స్పష్టమైన విధివిధానాలను ప్రకటించాలని, ఆసుపత్రుల జాబితాను వెల్లడి చేయాలని, ఏవైనా సవరణలు ఉంటే పూర్తి చేసిన అనంతరమే ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని తీర్మానించారు.

ఉద్యోగులు ప్రభుత్వానికి ప్రజల మధ్య వారధిగా పనిచేస్తున్నారని వారిని రక్షించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు వేతన స్థిరీకరణ చేస్తూ 40% ఫిట్మెంట్ ప్రకటించాలని తీర్మానించారు. సిపిఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, నీటిపారుదల శాఖలో రాష్ట్రపతి ఉత్తర్వులను అమలు చేయాలని, సిద్దిపేట జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, మరణించిన ఉద్యోగి కుటుంబానికి కారుణ్య నియామకం వద్దనుకుంటే ఆ కుటుంబానికి 20 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని తీర్మానించారు.

# వ్యవసాయంలో కొత్త దిశగా అడుగులు..



మహబూబ్‌నగర్, జూన్ 11: ఆర్గానిక్ వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ నగరంలోని పాలమూరు గో ఆధార్ ఫార్మర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రస్తుత కాలంలో వ్యవసాయంలో అధికంగా రసాయనాల వినియోగం వల్ల నేల నాణ్యత తగ్గిపోవడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో రసాయనాలు, చీడపీడల మందులు వాడకుండా ఆర్గానిక్ పద్ధతిలో పంటలను సాగు చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు మార్కెట్లో మంచి డిమాండ్ కలిగి ఉంటాయని తెలిపారు. రైతులు ఈ విధానాన్ని అవలంబించడం ద్వారా వారి ఆదాయం పెరగడమే కాకుండా సమాజానికి ఆరోగ్యకరమైన ఆహారం అందించవచ్చన్నారు. రైతులకు ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆర్గానిక్ పంటల మార్కెటింగ్‌కు తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు రైతులు సమూహాలుగా ఏర్పడి పనిచేయాలని సూచించారు.

ప్రతి గ్రామంలో ఆర్గానిక్ వ్యవసాయంపై చైతన్యం పెంచుతూ, పండించిన పంటలను నేరుగా వినియోగదారులకు అందించే విధానాన్ని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్గానిక్ ఆహార వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

రాబోయే రోజుల్లో రైతులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ఆర్గానిక్ వ్యవసాయాన్ని మరింత విస్తరించే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఆర్గానిక్ వ్యవసాయం చేస్తున్న రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, పాలమూరు గో ఆధార్ ఫార్మర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు ముకుంద్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వినోద్ కుమార్, రాజ్‌గోపాల్ గౌడ్, దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అరుణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐ నీ మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు..

నల్గొండ, జూన్ 12:కమ్మర్ పల్లి మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ సిహెచ్. సతీష్ ను శుక్రవారం కమ్మర్ పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ఐ సతీష్ ను శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు సహకారం అందిస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతిభద్రతలను మరింత పటిష్టంగా అమలు చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు అజ్మత్ పాషా, నల్ల సాయి కుమార్ గుప్తా, వేములవాడ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ బాధితుడికి అప్పగింత..

నల్గొండ, జూన్ 12: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి టేకుమట్ల పోలీసులు బాధితుడికి అప్పగించారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఏసుబాబు అనే వ్యక్తి చిట్యాల మండలం గిద్ద ముత్తారంలో ఉంటూ మేస్త్రి పని చేసుకుంటున్న క్రమంలో భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కు వచ్చి పోతుండగారూ.16వేల విలువైన ఒప్పో మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు.

అనంతరం ఆయన టేకుమట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి ఫోన్‌ను ట్రాక్ చేసి గుర్తించారు. అనంతరం బాధితుడికి ఫోన్‌ను అప్పగించారు.ఈ సందర్భంగా ఎస్సై అమూల్య మాట్లాడుతూ ఎవరికైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా దొంగతనానికి గురైనా సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

# నవ్వుల నందనవనం... వేద విజ్ఞాన నిలయం...ముదిగంటి జీవన సారం


నివాళి...

తెలంగాణ వైతాళికుల చరిత్రలో విద్యా వికాసానికి, సాహిత్య సౌరభాల వ్యాప్తికి తమ జీవితాలను అంకితం చేసిన ధన్యజీవులు కొందరే ఉంటారు. ఆ అరుదైన మహనీయుల వరుసలో అగ్రభాగాన నిలిచే నిగర్వి, విద్యావేత్త, వైదిక వాఙ్మయ నిర్వాహకుడు, హాస్య నిధి ముదిగంటి నర్సింహారెడ్డి.

తెలంగాణ విద్యా, సాహిత్య, సాంస్కృతిక చైతన్య చరిత్రలో కొన్ని వ్యక్తిత్వాలు కేవలం వ్యక్తులుగా కాక, ఒక తరాన్ని నడిపించిన యుగప్రతీకలుగా నిలుస్తాయి. తమ మేధస్సును, వ్యక్తిగత జీవితాన్ని సమాజ శ్రేయస్సుకు అంకితం చేసి, విద్యా వికాసానికి, మాతృభాషా పరిరక్షణకు, వైదిక వాఙ్మయ వ్యాప్తికి నిరంతరం కృషి చేసిన మహనీయులు ప్రతి శతాబ్దంలోనూ అరుదుగానే ఉద్భవిస్తారు. అలాంటి అరుదైన బహుముఖ ప్రజ్ఞాశాలీ, విద్యావేత్తా, సృజనాత్మక నవలా రచయితా, హాస్య సాహిత్య స్రష్టా, వైదిక వాఙ్మయ ప్రచారకుడూ అయిన ముదిగంటి వెంకట నర్సింహారెడ్డి ఈ కోవకే చెందుతారు. ఇటీవల 2026 జూన్ 8న ఆయన తన 87వ ఏట పరమపదించడంతో తెలంగాణ విద్యా, సాహిత్య, ఆధ్యాత్మిక రంగాలు ఒక మహోన్నత శిఖరాన్ని కోల్పోయాయి. ఒకే జీవిత కాలంలో ఒక వ్యక్తి ఎన్ని రకాల విభిన్న రంగాలలో అత్యున్నత ప్రమాణాలతో కూడిన ముద్రను వేయవచ్చో నిరూపించిన అపూర్వ ఉదాహరణ ఆయన ప్రస్థానం.

జగిత్యాల సమీపంలోని తక్కలపెల్లి గ్రామంలో 1939వ సంవత్సరంలో ఒక సంప్రదాయ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ముదిగంటి నర్సింహారెడ్డి, బాల్యం నుంచే చదువుపై, తెలుగు భాషపై, సామాజిక అంశాలపై ప్రత్యేకమైన ఆసక్తిని పెంపొందించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో, అంటే 1960 ప్రాంతంలో విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలను ప్రభుత్వం రద్దు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ జరిగిన విద్యార్థి ఉద్యమాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారు. ప్రజాస్వామ్య విలువల పట్ల, విద్యార్థుల హక్కుల పట్ల ఆయనకున్న నిబద్ధతకు ఆనాటి ఉద్యమ భాగస్వామ్యమే తొలి నిదర్శనం. విద్యార్థి దశలోనే ఇటువంటి సామాజిక చైతన్యం అలవడిన ఆయన, తర్వాతి కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా జరిగిన సాంస్కృతిక, సామాజిక ఉద్యమాల్లో ఒక ప్రధాన శక్తిగా ఎదిగారు.

ఉన్నత చదువులు పూర్తి చేసిన అనంతరం ముదిగంటి నర్సింహారెడ్డి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. నాటి రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, అది సమాజ నిర్మాణానికి అత్యంత ప్రభావవంతమైన సాధనమని ఆయన బలంగా నమ్మారు. ఒక సాధారణ పాఠశాల ఉపాధ్యాయుడిగా ప్రారంభమైన ఆయన సుదీర్ఘ ప్రయాణం, విద్యాశాఖలో క్రమక్రమంగా పదోన్నతులు పొందుతూ మండల విద్యాధికారి (ఎమ్ఈఓ) స్థాయి వరకు సాగింది. పదవులు, హోదాలు మారినప్పటికీ ఆయనలోని నిరాడంబరత, నిబద్ధత ఎన్నడూ చెదరలేదు. విద్యార్థుల్లో కేవలం మార్కులు, ర్యాంకులు సాధించడం కాకుండా, వారిలో విశిష్టమైన వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, దేశభక్తి, క్రమశిక్షణలను పెంపొందించడమే అసలైన విద్యా విధానమని ఆయన నిరూపించారు. ఈ విద్యా తత్వంతోనే ఆయన కరీంనగర్, జగిత్యాల పరిసర ప్రాంతాల్లోని అనేక ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల అభివృద్ధికి అహర్నిశలూ శ్రమించారు. ముఖ్యంగా జగిత్యాల ప్రాంతంలో సరస్వతీ విద్యాలయం, వాణీ జూనియర్ కళాశాల, విద్యా విద్యాసంస్థల స్థాపన, వాటి విస్తరణ, మూలస్తంభాల బలోపేతంలో ఆయన పాత్ర అద్వితీయమైనది. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు సైతం విలువలతో కూడిన నాణ్యమైన జాతీయ విద్యా విధానాన్ని అందించాలన్న సత్సంకల్పంతో ఆయన అనేక విద్యా విస్తరణ కార్యక్రమాలను స్వయంగా భుజాన వేసుకున్నారు. ఈ క్రమంలో ప్రముఖ విద్యావేత్త కాసుగంటి సుధాకర్‌రావు మార్గదర్శకత్వం ముదిగంటి ఆలోచనా విధానంపై, జీవన గమనంపై గాఢమైన ప్రభావం చూపింది. విద్యా పరిపాలనలో కఠినమైన క్రమశిక్షణను పాటిస్తూనే, మానవీయ కోణాన్ని, నిరుపమాన సేవాభావాన్ని ఎలా సమన్వయం చేయాలో ఆయన సుధాకర్‌రావు సాన్నిహిత్యం లోనే నేర్చుకున్నారని ఆయన సమకాలీనులు తరచూ గుర్తుచేసు కుంటుంటారు.

ముదిగంటి నర్సింహారెడ్డి జీవితంలో జగిత్యాలలో సుదీర్ఘకాలం నిర్వహించిన "కౌసల్య తెలుగు పండిత కళాశాల" ఒక విశిష్టమైన, చారిత్రాత్మకమైన అధ్యాయంగా నిలిచిపోతుంది. మాతృభాష అయిన తెలుగు ప్రాభవాన్ని కాపాడాలన్నా, రాబోయే తరాలకు భాషా సౌందర్యాన్ని అందించాలన్నా మొదట నిబద్ధత కలిగిన తెలుగు పండితులు అవసరమని ఆయన గ్రహించారు. ఈ లక్ష్యంతోనే స్థాపించబడిన కౌసల్య తెలుగు పండిత కళాశాల ద్వారా ఆయన దాదాపు రెండు మూడు దశాబ్దాల పాటు వేలాది మంది గ్రామీణ యువతీ యువకులకు తెలుగు పండిత శిక్షణ (టీపీటీ) ఇచ్చి, వారిని ఆదర్శ ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దారు. నేడు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వందలాది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వేలాది మంది తెలుగు ఉపాధ్యాయులు ముదిగంటి నర్సింహారెడ్డి గారి చేతుల మీదుగా, ఆయన ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో శిక్షణ పొంది వెలుగొందినవారే కావడం విశేషం. ఒక సమర్థుడైన ఉపాధ్యాయుడు వందలాది మంది విద్యార్థుల జీవితాలను, తద్వారా సమాజ భవిష్యత్తును సానుకూలంగా ప్రభావితం చేయగలడనే దృఢ విశ్వాసంతో ఆయన ఉపాధ్యాయ శిక్షణను కేవలం ఒక కోర్సులా కాకుండా ఒక పవిత్ర సామాజిక ఉద్యమంగా మలిచి నడిపించారు.

ముదిగంటి నర్సింహారెడ్డి సాహితీ ప్రస్థానాన్ని లోతుగా పరిశీలిస్తే, సాహిత్యం ఆయనకు కేవలం ఒక వినోద కాలక్షేపమో లేదా అప్పుడప్పుడు రాసే ఒక అభిరుచో కాదని, అది ఆయన అస్తిత్వంలోనే ఒక భాగమని, జీవిత ధ్యేయమని స్పష్టమవుతుంది. దాదాపు అరవై సంవత్సరాల క్రితమే, అంటే జగిత్యాల ఒక చిన్న తాలూకా కేంద్రంగా ఉన్న రోజుల్లోనే, అక్కడి స్థానిక విజయలక్ష్మి ప్రెస్‌లో ముద్రితమై వెలువడిన "ప్రణయ పవనాలు ? పరితప్త హృదయాలు" అనే ఉద్గ్రంథ సామాజిక–కాల్పనిక నవల ఆయన అసాధారణ సృజనాత్మక ప్రతిభకు అద్దం పడుతుంది. ఆధునిక రవాణా, కమ్యూనికేషన్ సౌకర్యాలు లేని ఆ కాలంలో, ఒక చిన్న వెనుకబడిన గ్రామీణ పట్టణం నుండి నవలా రచయితగా ఎదగడం, ఆ నవలను ముద్రించి పాఠకుల చెంతకు చేర్చడం అంత సులువైన విషయం కాదు. అప్పటివరకు కేవలం చదువరుల పట్టణంగా, పండితుల నిలయంగా మాత్రమే పేరున్న జగిత్యాల ప్రాంతంలో ఆధునిక వచన నవలా రచనకు శ్రీకారం చుట్టిన తొలి తరం మార్గదర్శక రచయితల్లో ముదిగంటి నర్సింహారెడ్డి అగ్రగణ్యుడిగా నిలిచారు.

తొలి దశలో యువతను ఆకట్టుకునే కాల్పనిక రచనలు, మానవీయ సంబంధాల చుట్టూ తిరిగే ప్రేమకథలు, సామాజిక ఇతివృత్తాలతో కూడిన కథనాలు రచించిన ఆయన, మధ్య వయస్సు వచ్చేసరికి హాస్య సాహిత్యాన్ని తన ప్రధాన రచనా ప్రక్రియగా ఎంచుకున్నారు. నిత్యజీవితం లోని మానసిక ఒత్తిడులను, కష్టాలను దూరం చేయడానికి నిర్మలమైన నవ్వు ఒక అద్భుతమైన దివ్యౌషధమని ఆయన బలంగా విశ్వసించారు. అందువల్లనే ఆయన హాస్యాన్ని కేవలం చౌకబారు వినోద సాధనంగా మార్చకుండా, సామాజిక చైతన్యానికి, మానవ వికాసానికి ఒక సముచిత సాధనంగా మలిచారు. నిత్య సమాజంలో మనం చూసే విచిత్ర సంఘటనలు, లౌక్యాలు, మానవ నైజంలోని బలహీనతలు, సమకాలీన సామాజిక వైరుధ్యాలను అత్యంత చమత్కారంగా, ఎవరినీ నొప్పించకుండా చిత్రితం చేస్తూ ఆయన అనేక హాస్య కథలను, వ్యంగ్య వ్యాసాలను, జోకుల సంకలనాలను పుస్తక రూపంలో వెలువరించారు. ఆయన ప్రతి హాస్య రచన వెనుకా ఒక అంతర్లీనమైన నైతిక సందేశం ఉండేది, వ్యవస్థలోని లోపాలపై సూటియైన విమర్శ ఉండేది, పాఠకుడిని నవ్విస్తూనే ఆలోచింపజేసే తత్వం ఉండేది.

ఆయన నిరుపమాన సాహిత్య కృషికి గుర్తింపుగా, తెలుగు సాహిత్య జగత్తులో అత్యున్నతమైన జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకున్న మహాకవి డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారె) గారి చేతుల మీదుగా ముదిగంటి నర్సింహారెడ్డి రచించిన పలు గ్రంథాలు ఆవిష్కృతం కావడం విశేషం. 1975వ సంవత్సర ప్రాంతంలో, నాటి కరీంనగర్ జిల్లాలోని మల్యాల గ్రామానికి డాక్టర్ సి. నారాయణరెడ్డి గారిని స్వయంగా ఆహ్వానించి, ముదిగంటి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ సాహిత్య సభ నాటి సాంస్కృతిక చైతన్యానికి మచ్చుతునక. గ్రామీణ ప్రాంత ప్రజల్లో, ముఖ్యంగా సామాన్యుల్లో సాహితీ అభిరుచిని, భాషాభిమానాన్ని పెంపొందించేందుకు ముదిగంటి చేసిన ఆ వినూత్న ప్రయత్నం అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా విశేష చర్చనీయాంశమైంది. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, రాజ్యసభ సభ్యుడైన సినారెను గ్రామీణ సాంప్రదాయ పద్ధతిలో అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపుతో సభా వేదికకు తీసుకెళ్లిన ఆ చారిత్రాత్మక సంఘటనను నేటికీ కరీంనగర్, జగిత్యాల జిల్లా సాహిత్య వర్గాలు ఎంతో గర్వంగా స్మరించుకుంటాయి.

సాహిత్య కారుడిగా, హాస్య రచయితగా రాష్ట్రవ్యాప్త గుర్తింపు పొందిన తరువాత, ముదిగంటి నర్సింహారెడ్డి గారి శేష జీవితంలో ఒక అద్భుతమైన మరియు అత్యంత విశేషమైన మలుపు చోటుచేసుకుంది. అది ఆధ్యాత్మిక, వైదిక వాఙ్మయ రచనల వైపు ఆయన చిత్తం మళ్లడం. భారతీయ సనాతన సంస్కృతికి, జీవన విధానానికి మూలాధారాలైన వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలపై ఆయన లోతైన అధ్యయనాన్ని, పరిశోధనను ప్రారంభించారు. కేవలం పండితులకే పరిమితమై, సంస్కృత భాషా ప్రాకారాల వెనుక సామాన్యుడికి అందనంత దూరంలో ఉన్న వేద విజ్ఞానాన్ని, ప్రతి సాధారణ గృహస్థుడికీ అర్థమయ్యే రీతిలో సరళంగా అందించాలనే పవిత్ర సంకల్పం ఆయనలో అంకురించింది. దీని ఫలితంగానే ఆయన చతుర్వేదాలైన ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదాలకు తెలుగులో అత్యంత సరళమైన, స్పష్టమైన వచనానువాదాలను సుదీర్ఘకాలం శ్రమించి గ్రంథస్థం చేశారు. వేదాలలోని గంభీరమైన మంత్రార్థాలను, విశ్వజనీనమైన తాత్విక సూత్రాలను సామాన్య పాఠకుడి మేధస్సుకు సైతం సులభంగా అవగతమయ్యే శైలిలో వివరిస్తూ ఆయన రూపొందించిన వేద సంపుటాలు నేడు తెలుగు ఆధ్యాత్మిక గ్రంథాలయంలో మైలురాళ్లుగా నిలిచాయి.

వేదాల అనువాదంతోనే ఆగకుండా, ఉపనిషత్తులలోని పరమార్థాన్ని సామాన్యులకు చేర్చడం కోసం "అమృతోపనిషత్తులు" అనే పేరుతో రెండు బృహత్తర భాగాలను వెలువరించి, భారతీయ వేదాంత సారాన్ని సరళీకరించారు. అలాగే హిందూ తత్వశాస్త్రంలో అత్యంత కఠినమైనవిగా భావించే బాదరాయణుని బ్రహ్మసూత్రాల నాలుగు అధ్యాయాలకు సూటియైన, ప్రతీ ఒక్కరూ చదవదగ్గ సరళ వ్యాఖ్యానాన్ని అందించారు. వ్యాస మహర్షి ప్రోక్తాలైన అష్టాదశ (18) పురాణాలను సామాన్యులు చదవడానికి వీలుగా సంగ్రహ రూపంలో తెనుగీకరించి ప్రచురించారు. వీటికి తోడు హైందవ సంస్కృతికి రెండు కళ్ల లాంటి రామాయణ, మహాభారత ఇతిహాసాలను ఎక్కడా మూల కథ దెబ్బతినకుండా వచన రూపంలో అందించి, ఆధునిక తరానికి సులభ పఠన యోగ్యంగా మార్చారు. వేదాలు, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, పురాణాలు, ఇతిహాసాల వంటి విస్తృత వైదిక వాఙ్మయంపై ఒకే ఒక వ్యక్తి తన జీవితకాలంలో ఇంతటి భారీ సాహిత్య సేవ చేయడం కేవలం ఒక అద్భుతం మాత్రమే కాదు, అది ఈశ్వర సంకల్పంగానే భావించాల్సి ఉంటుంది.

సంస్కృత భాషలో నిక్షిప్తమై ఉన్న ప్రాచీన ఆధ్యాత్మిక వేదాంత సంపదను తెలుగులోకి అనువదించడం అనేది సాధారణమైన విషయం కాదు.

దానికి కేవలం భాషా పరిజ్ఞానం ఉంటే సరిపోదు; మూల గ్రంథాలపై సంపూర్ణ పాండిత్యం, సంస్కృత సమాస పటిమ, తెలుగు వచన నిర్మాణ నైపుణ్యం మరియు అన్నింటికీ మించి లోతైన తాత్విక అనుభవ పూర్వక అవగాహన అవసరం. ఈ విశిష్ట లక్షణాలన్నీ ముదిగంటి వెంకట నర్సింహారెడ్డి గారిలో సమన్వయంగా ఉండటం వల్లే ఆయన ఈ మహత్తర భగవత్ కార్యాన్ని విజయవంతంగా, నిరాటంకంగా పూర్తి చేయగలిగారు. తన జీవితాంతం, ముఖ్యంగా చివరి రెండున్నర దశాబ్దాల కాలాన్ని ఆయన దాదాపుగా ఈ ఆధ్యాత్మిక గ్రంథాల రచన, వాటి సంపాదన, ప్రచురణ మరియు ప్రచార కార్యక్రమాలకే పూర్తిగా అంకితం చేశారు. ఆయన ముద్రించిన వేద పుస్తకాలు ఎన్నో నగరాలు, గ్రామాల్లోని దేవాలయాలకు, గ్రంథాలయాలకు చేరి వేద విజ్ఞాన జ్యోతులను వెలిగిస్తున్నాయి.

వ్యక్తిగత జీవన విధానంలో ముదిగంటి నర్సింహారెడ్డి అత్యంత నిరాడంబరుడు, నిగర్వి. సమాజంలో ఎంతో కీర్తి ప్రతిష్ఠలు, అధికార పదవులు, సాహిత్య గౌరవాలు దక్కినప్పటికీ ఆయన తన సహజసిద్ధమైన వినమ్ర స్వభావాన్ని, నిగర్వి తనాన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. జగిత్యాల పట్టణంలో ఎవరైనా యువ రచయితలు, కవులు తమ తొలి పుస్తకాలను పట్టుకుని ఆయన వద్దకు వెళ్తే, వారిని ఎంతో ఆప్యాయంగా ఆహ్వానించి, ఆ రచనలను చదివి, తగిన సలహాలు ఇస్తూ ప్రోత్సహించడం ఆయనకు అలవాటు. స్థానికంగా జరిగే చిన్న చిన్న సాహిత్య సభల నుంచి పెద్ద పెద్ద ఆధ్యాత్మిక సమ్మేళనాల వరకు ప్రతీ చోటా ఆయన ఉత్సాహంగా పాల్గొని తన ప్రసంగాల ద్వారా చైతన్యాన్ని నింపేవారు. విద్యా కార్యక్రమాలకు, పేద విద్యార్థుల చదువులకు సహాయం చేయడం ఆయన దినచర్యలో ఒక అంతర్భాగంగా ఉండేది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాల విద్యా చైతన్యం పెంపొందించడానికి, అందులోనూ బాలికల ఉన్నత విద్యాభివృద్ధికి ఆయన చూపిన ప్రత్యేక శ్రద్ధ, చేసిన నిశ్శబ్ద సహాయాలు ఎందరికో ఆదర్శంగా నిలిచాయి.

సమకాలీన తెలంగాణ సమాజంలో విద్యా వికాసం, తెలుగు భాషా చైతన్యం, వేద విజ్ఞాన ప్రచారం, మరియు ఉత్తమమైన హాస్య సాహిత్య పరిరక్షణ గురించి ఎప్పుడు చర్చించినా, ఎక్కడ పరిశోధనలు జరిగినా ముదిగంటి వెంకట నర్సింహారెడ్డి గారి పేరును విస్మరించడం ఎవరికీ సాధ్యం కాదు. ఒకవైపు నిబద్ధత కలిగిన విద్యా పరిపాలకుడిగా ప్రభుత్వ విద్యా ప్రమాణాలను పెంచిన అధికారిగా, మరోవైపు ఉపాధ్యాయ శిక్షకుడిగా వేలాది మంది ఆదర్శ గురువులను సృష్టించిన సృష్టికర్తగా, ఇంకోవైపు ఆధునిక నవలా రచయితగా జగిత్యాల సాహిత్య బావుటాను ఎగురవేసిన సాహితీవేత్తగా, సరళమైన ఆధ్యాత్మిక గ్రంథకర్తగా ఆయన పోషించిన బహుముఖ పాత్రలు తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినవి. విద్య ద్వారా ఎందరో జీవితాల్లో జ్ఞానపు వెలుగులు నింపినవాడు, వేద అనువాదాల ద్వారా సనాతన సంస్కృతిని జన బాహుళ్యంలో కాపాడినవాడు, చమత్కార హాస్య రచనల ద్వారా సమాజంలో నవ్వుల నందనవనాన్ని నిర్మించినవాడు, నిరంతర భాషా సేవ ద్వారా భావితరాల తెలుగు పాఠకులకు దిక్సూచిగా నిలిచినవాడు ముదిగంటి నర్సింహారెడ్డి. 2026 జూన్ 8న ఆయన భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ఆయన సృష్టించిన అక్షర సామ్రాజ్యం, ఆయన పెంపొందించిన విద్యా విలువలు, ఆయన అందించిన వేద విజ్ఞాన సంపద తరతరాల పాటు తెలంగాణ సమాజాన్ని ప్రగతి పథంలో ప్రభావితం చేస్తూనే ఉంటాయి. జగిత్యాల జిల్లా మరియు యావత్ తెలంగాణ రాష్ట్ర విద్యా, సాహిత్య, ఆధ్యాత్మిక, సాంస్కృతిక చారిత్రక పుటలలో ముదిగంటి వెంకట నర్సింహారెడ్డి గారి నామం చిరస్థాయిగా, అజరామరంగా నిలిచిపోతుంది అనడంలో ఎలాంటి సందేహం



–రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

---

## కరీంనగర్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ..

### బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలి



కరీంనగర్, జూన్ 12: (నేటినిజం ప్రతినిధి) ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోజున మహిళా, శిశు సంక్షేమ శాఖ, కార్మిక శాఖ, పోలీసు శాఖ, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సమన్వయంతో కరీంనగర్‌లో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుండి గీత భవన్ చౌరస్తా వరకు కొనసాగిన ఈ ర్యాలీని జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా కార్మిక శాఖ అధికారి ప్రసాద్ లు ప్రారంభించారు. ర్యాలీ సందర్భంగా వివిధ దుకాణాలు, వాణిజ్య సంస్థలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులు పనిచేస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. బాల కార్మికులు లేని దుకాణాల యజమానులకు అవగాహన కల్పించి, "బాల కార్మికుల రహిత దుకాణం" స్టిక్కర్లను అంటించడం జరిగింది. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినట్లయితే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధి చంద్రప్రకాశ్ రెడ్డి, సీడీపీఓలు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్, బాలల పరిరక్షణ సిబ్బంది శాంత, తిరుపతి, సాదినేని రమేష్, కార్మిక శాఖ అధికారులు, పోలీసు టాస్క్ ఫోర్స్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : ఆడెపు వరలక్ష్మి

ఖైరతాబాద్, జూన్ 12 : అసలే చాలీ చాలనీ వేతనాలు ఇస్తున్నారని, రెండు నెలలుగా అవి కూడా రావడం లేదని తెలంగాణ రాష్ట్ర (మినీ) అంగన్‌వాడీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆడెపు వరలక్ష్మి తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె అంగన్‌వాడీల విషయంలో ప్రభుత్వ తీరును ఎండగట్టారు. రాష్ట్రంలోని 66 వేల మంది అంగన్‌వాడీలు గత రెండు నెలలుగా వేతనాలు లేక అప్పులపాలవుతున్నారని, ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా వేదిస్తోందన్నారు. ప్రతి నెలా జీతాల కోసం ప్రభుత్వాన్ని అడుక్కోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వ అప్పులు

కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి సేవలందించామని, కాని తాము దవాఖానల పాలైతే కనీసం సెలవులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. తమ ఉద్యోగం, ప్రాణాలకు భరోసా లేదన్నారు. పాలక ప్రభుత్వాలు తమతో ఎ ౦ ట ి ౦ చా ౦ క ి ౦ రి చేయించుకుంటున్నాయి తప్ప తమను రెగ్యులరైజ్ చేయాలన్న ఆలోచన చేయడం లేదన్నారు.

## సింగరేణిని నామరూపాలు లేకుండా చేసేందుకు కుట్రలు.. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

–వరుస కుంభకోణాలకు తెరలేపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

–40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉందనేది ఒక ఫేక్ మాత్రమే

–పనికిరాని బొగ్గు.. మట్టి పెల్లలు, బండలనే బొగ్గు అని చూపిస్తుండ్రు



రాజన్న సిరిసిల్ల, జూన్ 12: (నేటినిజం ప్రతినిధి): సింగరేణి సంస్థను నామరూపాలు లేకుండా చేయడం కోసమే దుర్మార్గమైన ప్రయత్నాలు జరుగుతున్నాయని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. రామగుండం RG-1, OCP 5లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, టీజీబీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి ఆయన రామగుండం బొగ్గు నిల్వలను పరిశీలించి ప్రభుత్వం చూపిస్తున్న బొగ్గు నిల్వలు లెక్కల వాస్తవాలు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో వరుస కుంభకోణాలతో సంస్థనే ప్రశ్నార్థకం చేసేలా దోపిడీ జరుగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుస కుంభకోణాలకు తెరలేపుతోందన్నారు. ఒకప్పుడు సింగరేణి సంస్థ ఈ ప్రాంతంలో అనేక మంది పేదవాళ్లకు ఉద్యోగాలు ఇచ్చిన సంస్థ అని, లక్షల కుటుంబాలు బతుకుదెరువు చూపించిన సంస్థ అని ఆయన గుర్తు చేశారు. కానీ ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓబీ కాంట్రాక్టర్లు, సోలార్ పవర్ ప్లాంట్, డెటోనేటర్ కాంట్రాక్ట్, పవర్ ప్రాజెక్టుల విషయంలో కుంభకోణాల పరంపర కొనసాగిస్తుందని ఆరోపించారు.

అధికారిక లెక్కలు సింగరేణి వెబ్‌సైట్ ఉన్న లెక్కల ప్రకారం సింగరేణి వ్యాప్తంగా ఆయా గనులపై 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వ ఉందని ప్రభుత్వం లెక్కలు చూపిస్తున్నదని పేర్కొన్నారు. RG-1, OCP 5 లో 6 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వ చేసి ఉందని, ప్రస్తుతం 3 లక్షల 60 వేల టన్నులు అని చెప్తున్నారని, కానీ ఇక్కడికి వచ్చి చూస్తే మొత్తం మట్టి బెడ్డలు బండలు పనికి రాని వాటిని కుప్పలు చేసి బొగ్గు అని చూపించే ప్రయత్నం చేస్తున్నారని, కేవలం ఇక్కడ 50 వేల మెట్రిక్ టన్నులు కూడా ఉన్నట్లు కన్పించడం లేదని ఆయన అన్నారు. సింగరేణి సంస్థను సర్వనాశనం చేయడంతో పాటు కార్మికుల జీవితాలతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ మంత్రి నేతృత్వంలోనే అనేక అరాచకాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. నిల్వలు ఎక్కడెక్కడ చూపిస్తున్నరో అక్కడ ఇదే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంపై సీబీఐ ఎంక్వైరీ జరుపాలని, లేని బొగ్గును ఎలా సృష్టిస్తరో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనాన్ని వృథా చేయడంలో ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం చేస్తుందో అర్థం అవుతుందన్నారు. సింగరేణి ప్రజల ఆస్తి అని ఆ ఆస్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

ఇటీవల గోదావరిఖనికి వచ్చిన మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు పలు విషయాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారని, అందులో ముఖ్యంగా డిపెండెట్ ఉద్యోగాల విషయాన్ని ప్రస్తావించారని, 400 మంది కార్మికులను అన్‌పిట్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారనే విషయాన్ని వెల్లడించారని, ఈ క్రమంలో అధికారులు ఈ విషయం బయటకు వస్తే పరువు పోతుందని జాగ్రత్త పడి, రెండు రోజుల్లో కార్మికులకు ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. వరుస కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జోగులాంబ గద్వాల, జూన్ 12: : అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తుందని, ఎంపికైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడివోసి సమావేశపు మందిరంలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లక్కీ డిప్ విధానంలో కలెక్టర్ ఎంపిక చేశారు.

నాన్ రెసిడెన్షియల్ ఒకటవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 57 సీట్లు ఉండగా, మొత్తం 265 మంది దరఖాస్తు చేసుకోగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మహిళా రిజర్వేషన్స్, జనరల్ కోటాలో నిబంధనల ప్రకారం డిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. రెసిడెన్షియల్ ఐదవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 59 సీట్లు ఉండగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మొత్తం 310 మంది దరఖాస్తు చేసుకోవడంతో అర్హులైన వారిలో నుంచి డిప్ విధానంలో విద్యార్థులను ఎంపిక చేశారు.

వివిధ గ్రూపులకు సంబంధించి వెయిటింగ్ లిస్టు ప్రాతిపదికన కొంతమంది విద్యార్థులను కూడా డిప్ విధానంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంపికైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, ఏఎస్సీడబ్ల్యూవో నాగరాజు, సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, బీచుపల్లి గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ రామాంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.